1 St Year Happy Work Anniversary.

షణ్ముఖ

RNI : APTEL / 2023 / 89152

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు

తెలుగు దినపత్రిక

Good for Health

Best for Readers

సంపుటి : 2 సంచిక : 140 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శుక్రవారం 04 ఏప్రిల్ 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 140 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Friday 04 April 2025 PAGES : 8 PRICE : 3/-

# పేదలకు "పట్టా" భిషేకం

**పేదలకు ఉచితంగా శాశ్వత గృహ పట్టాలు**
**గోవిందు కుటుంబానికి స్వయంగా పట్టా అందించిన మంత్రి లోకేశ్**
**ముఖ్యమైన హామీని నెరవేర్చడం సంతోషంగా ఉంది**
**మంగళగిరిని టీడీపీ కంచుకోటగా మార్చుతా**
**రాష్ట్ర మంత్రి నారా లోకేష్**



(షణ్ముఖ వెలుగు, మంగళగిరి, ఏప్రిల్ 3)

రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. ఉండవల్లిలో దశాబ్దాలుగా ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న పేదలకు ఉచితంగా శాశ్వత గృహ పట్టాలను అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా, 15 సంవత్స రాలు గా కొండవాలు ప్రాంతంలో నివసిస్తున్న రాజమండ్రి గోవిందు కుటుంబానికి స్వయంగా వారి ఇంటికి వెళ్లి కొత్త బట్టలు పెట్టి శాశ్వత పట్టాను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం పేదలకు 'పట్టా'భిషేకం చేస్తున్నామని, ముఖ్యమైన హామీని నెరవేర్చడం సంతోషంగా ఉందన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో అటవీ, దేవాదాయ, రైల్వే, ఇరిగేషన్ భూముల్లో ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న ప్రజల కష్టాలను చూశానని, వారికి శాశ్వత పట్టాలు ఇవ్వాలని నిర్ణయించానని తెలిపారు. ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న పేదలకు మూడు విడతలుగా శాశ్వత పట్టాలు ఇవ్వాలని నిర్ణయించామని, మొదటి విడతలో 150 గజాల్లోపు ఉంటున్న 3 వేల మందికి పట్టాలు ఇస్తున్నామని, రెండో విడతలో ఎండోమెంట్స్, రైల్వే భూముల్లో నివసించేవారికి, మూడో విడతలో మిగిలిన వారందరికీ పట్టాలు అందజేస్తామని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. 2019 ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ, మంగళగిరి ప్రజల మనస్సు గెలుచు కోవడానికి గత ఐదేళ్లుగా తన సొంత నిధు లతో 26 సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించినట్లు లోకేశ్ తెలిపారు. ఉచిత తాగునీటి ట్యాంకర్లు, గ్రావెల్ రోడ్ల నిర్మాణం, కరోనా సమయంలో ఆక్సిజన్, టెలీ మెడిసిన్ సేవలు, ఎన్టీఆర్ సంజీవని ఆరోగ్య రథాలు, యువత కోసం క్రీడా పోటీలు వంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు.



ప్రజలు తనపై నమ్మకంతో 91 వేల భారీ మెజారిటీతో గెలిపిం చారని, ఇది తన బాధ్య తను మరింత పెంచిందని అన్నారు. మంగళగిరిలో 50 అభివృద్ధి కార్య క్రమా లకు శ్రీకారం చుట్టామని, స్వచ్ఛ మంగళగిరి కార్యక్రమం ద్వారా పార్కులు, రైతు బజార్లు అభివృద్ధి చేస్తున్నామని లోకేశ్ తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పైప్ లైన్ ద్వారా గ్యాస్ వంటి ప్రాజెక్టులు మిగతా 2లో

# సునీతను ఏమైనా చేస్తారనే భయం నాలో ఉంది

## : వైఎస్ షర్మిల

**వివేకా హత్య కేసులోని నిందితులు ఒక్కొక్కరుగా ప్రాణాలు కోల్పోతున్నారన్న షర్మిల**
**అవినాశ్ బెయిల్ పై ఉండటం వల్లే సునీతకు న్యాయం జరగడం లేదని వ్యాఖ్య**

(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 3)



హత్య జరిగినప్పుడు అక్కడ అవినాశ్ రెడ్డి ఉన్నారన్న షర్మిల

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు గురించి ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న వైసీపీ ఎంపీ అవినాశ్ రెడ్డి బెయిల్ పై బయట ఉంటూ సాక్షులను బెదిరిస్తున్నారని అన్నారు. వివేకా హత్య కేసులోని సాక్షులు ఒక్కొక్కరుగా ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వివేకా కూతురు సునీత ప్రాణాలకు కూడా రక్షణ లేదని షర్మిల అన్నారు. ఈ కేసులో నిందితులుగా ఉన్నవారు సునీతను ఏమైనా చేస్తారనే భయం తమలో ఉందని చెప్పారు. ఇటీవల తనకు కొన్ని విషయాలు తెలిశాయని... అవి తనను ఆలోచింపజేస్తున్నాయని అన్నారు. సునీతకు ఇద్దరు పిల్లలు ఉన్నారని చెప్పారు. అవినాశ్ బెయిల్ రద్దు చేయాలంటూ ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్ లో పలు విషయాలను పేర్కొందని షర్మిల తెలిపారు. విచారణ అధికారులను అవినాశ్ పిలిపించుకుని బెదిరించినట్టు అఫిడవిట్ లో ఉందని... తప్పుడు రిపోర్టుపై అధికారులతో అవినాశ్ సంతకాలు చేయించినట్టు ఉందని చెప్పారు. అవినాశ్ బెయిల్ పై ఉండటం వల్లే సునీతకు న్యాయం జరగడం లేదని అన్నారు. వివేకాను సునీత, ఆమె భర్త చంపించినట్టు తప్పుడు రిపోర్టు ఇచ్చారని తెలిపారు. హత్య జరిగినప్పుడు ఘటనాస్థలిలో ఉన్నది అవవినాశ్ రెడ్డేనని చెప్పారు.

# ట్రంప్ టారిఫ్ బాంబ్.. భారత్‌లో ఈ రంగాలపై ఎఫెక్ట్

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ, ఏప్రిల్ 3)



అంచనాలను మించి భారత్‌పై టారిఫ్‌ల బాంబు వేశారు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. న్యూఢిల్లీ తమకు వాణిజ్య భాగస్వామి అని చెబుతూనే.. సుంకాల మోత మోగించారు. అమెరికా ఉత్పత్తులపై ఇతర దేశాలు విధిస్తున్న టారిఫ్‌లతో పోలిస్తే.. తాము సగం మేర మాత్రమే వసూలు చేయనున్నట్లు తెలిపారు. భారత్ తమ ఉత్పత్తులపై సగటున 52% సుంకం విధిస్తున్నందున, తాము 27% సుంకం విధిస్తున్నట్లు వెల్లడించారు. అయితే, ట్రంప్ నిర్ణయంతో మన దేశంలోకి కొన్ని రంగాలపై కీలక ప్రభావం పడనుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా వ్యవసాయ అనుబంధ, ఫార్మా ఉత్పత్తులపై ఎఫెక్ట్ ఉండనున్నట్లు పేర్కొంటున్నారు. మరి ఆ రంగాలు ఏంటంటే..?

**వ్యవసాయం, డెయిరీ, సీఫుడ్..**

గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ విశ్లేషణ ప్రకారం.. ట్రంప్ టారిఫ్‌ల వల్ల వ్యవసాయ రంగ సంబంధిత ఎగుమతులపై అత్యధిక ప్రభావం ఉండనున్నట్లు తెలుస్తోంది. భారత రొయ్యలు, ఇతర సీఫుడ్ ఉత్పత్తులకు యూఎస్ ప్రధాన దిగుమతిదారుగా ఉంది. 2024లో అమెరికాకు చేపలు, ఇతర ప్రాసెస్డ్ సీఫుడ్ ఎగుమతుల విలువ 2.58 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇప్పుడు తాజా సుంకాల వల్ల అగ్రరాజ్య మార్కెట్లో వీటి ధరలు పెరుగుతాయి. దీంతో గిరాకీ ఆశించిన మేర **ఉండకపోవచ్చని నిపుణుల అభిప్రాయం.**

రంగాల వారీగా ఉత్పత్తులపై సుంకాలు భిన్నంగా ఉంటాయి. ట్రంప్ తాజా నిర్ణయంతో మన డెయిరీ ఉత్పత్తులపై టారిఫ్‌లు 38.23 శాతానికి చేరనున్నాయి. దీంతో అగ్రరాజ్యంలో మన వెన్న, నెయ్యి, పాలపొడి ధరలు కూడా పెరుగుతాయి. భారత్ నుంచి అమెరికాకు 181.49 మిలియన్ డాలర్ల డెయిరీ మిగతా 2లో

# చల్లని కబురు.. హైదరాబాద్‌లో పలు చోట్ల వర్షం

(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 3)



గత కొన్ని రోజులుగా ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న హైదరాబాద్ నగరవాసులను వరుణుడు పలకరించాడు. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలో వర్షం కురిసింది. దీంతో నగర వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. హిమయత్‌నగర్, కోఠి, అమీర్‌పేట, బోరబండ, జూబ్లీహిల్స్, ఎల్బీనగర్, హయత్‌నగర్, మేడ్చల్, విద్యానగర్, కోఠి, అబిడ్స్ తదితర ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. పలు చోట్ల ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఖైరతాబాద్‌లోని మెర్క్యూరీ హోటల్ వద్ద ఓ కారుపై చెట్టు కూలింది. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు సురక్షితంగా బయటపడ్డారు.

**పలు ప్రాంతాలు జలమయం**

అకాల వర్షంతో హైదరాబాద్ మహానగరంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాష్ట్ర సచివాలయం ముందుభాగం చెరువును తలపిస్తోంది. ఛార్మినార్‌లోని ఓ మీనార్‌పై నుంచి కొంత మట్టి కిందపడింది. ఈ ఘటనలో ఎలాంటి నష్టం వాటిల్లలేదు. వివిధ చోట్ల రోడ్లపై వర్షపు నీరు ప్రవహిస్తోంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మలక్‌పేట వంతెన వద్ద వరదనీరు నిలిచిపోయింది. రాజ్‌భవన్ రోడ్డుపై వరద నీరు ప్రవహిస్తుండటంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. తెలుగుతల్లి ఫ్లైఓవర్ కింద భారీగా నీరు చేరింది. పలుచోట్లు చెట్లు కూలిపోయాయి. స్తంభాలు ఒరిగిపోయాయి. ఖైరతాబాద్- పంజాగుట్ట మధ్య వాహనాల రాకపోకు నిలిచిపోయాయి.

# సంచలనాల ట్రంప్.. అమెరికాలో మాంద్యం తప్పదా..?

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ, ఏప్రిల్ 3)



అన్‌ప్రిడిక్టబుల్..ఈ పదం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు అతికినట్టు సరిపోతోంది. అధికారం చేపట్టినదగ్గరి నుంచి సుంకాలు వేస్తూ.. వెనక్కి తగ్గుతూ.. శత్రువులు, మిత్రుల జాబితాను మార్చేస్తూ.. రోజుకో కొత్త నిర్ణయం తీసుకుంటున్నారు. ట్రంప్ టారిఫ్‌లు అమెరికా ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపు తాయని, కార్పొరేట్ ఆదాయాలను దెబ్బతీస్తాయని, ద్రవ్యోల్బణాన్ని మరింత పెంచుతాయని పెట్టుబడ దారులు ఆందోళన చెందుతున్నారు. మిగతా 2లో

# విమానం అత్యవసర ల్యాండింగ్.. తుర్కియేలో చిక్కుకున్న 200 మంది భారతీయులు

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ, ఏప్రిల్ 3)

లండన్ నుంచి ముంబయికి రావాల్సిన విమానం తుర్కియే లో అత్యవసరంగా ల్యాండ్ అయింది దాంతో అక్కడి మారుమూల విమానాశ్రయంలో బుధవారం రాత్రి నుంచి 200 మంది భారత ప్రయాణికులు చిక్కుకుపోయారు జాతీయ మీడియా కథనాల ప్రకారం.. లండన్ నుంచి వర్జిన్ అట్లాంటిక్ విమానం ముంబయికి బయలుదేరింది. మెడికల్ ఎమర్జెన్సీ కారణంగా తుర్కియేలోని మారుమూల ప్రాంతంలోని దియార్‌బకిర్ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అయింది. అయితే ల్యాండ్ అయ్యే సమయంలో సాంకేతిక సమస్య తలెత్తిందని మిగతా 2లో



# థాయ్ మహిళా ప్రధాని షినవత్రా నుంచి ప్రధాని మోదీకి విశిష్ట కానుక

**థాయ్‌లాండ్ లో పర్యటిస్తున్న ప్రధాని మోదీ**
**థాయ్ ప్రధాని షినవత్రాతో ద్వైపాక్షిక సమావేశం**
**ఈ సందర్భంగా మోదీకి తిపిటక గ్రంథం బహూకరణ**

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ, ఏప్రిల్ 3)



భారత ప్రధాని నరేంద్ర మోదీకి థాయ్‌లాండ్ ప్రధాని పెటోంగ్‌టార్న్ షినవత్రా విశిష్ట కానుకను అందజేశారు. బ్యాంకాక్‌లో జరిగిన ద్వైపాక్షిక చర్చల సందర్భంగా 'ది వరల్డ్ తిపిటక: సజ్జాయ ఫొనెటిక్ ఎడిషన్' పేరు గల బౌద్ధ గ్రంథాన్ని మోదీకి బహుకరించారు. ఈ చర్య భారత్, థాయ్‌లాండ్ మధ్య బలమైన సాంస్కృతిక, భాషాపరమైన, మతపరమైన సంబంధాలకు నిదర్శనంగా నిలుస్తోంది.'తిపిటక' అంటే పాలీ భాషలో 'మూడు బుట్టలు'. ఇది బౌద్ధ ధర్మ గ్రంథాలలో ప్రధానమైనది. ఇందులో బౌద్ధ సన్యాసుల నియమాలు, సూత్రాలు, బోధనలు సంగ్రహించబడి ఉంటాయి. ఈ గ్రంథం మొత్తం 108 సంపుటాలుగా ఉంది. థాయ్ ప్రభుత్వం రాజు భూమిబల్ అతుల్యతేజ్ (రామ-9), రాణి సిరికిట్ 70వ వార్షికోత్సవం సందర్భంగా 2016లో 'వరల్డ్ తిపిటక ప్రాజెక్ట్'లో భాగంగా ఈ ప్రత్యేక ఎడిషన్‌ను ప్రచురించింది. పాలి, థాయ్ లిపులలో రూపొందించబడిన ఈ గ్రంథం, తొమ్మిది మిలియన్లకు పైగా పదాలను కలిగి ఉంది. అంతేకాకుండా, ఇది కచ్చితమైన ఉచ్చారణతో పఠించేందుకు వీలుగా రూపొందించబడింది.కానుక అందుకున్న సందర్భంగా ప్రధాని మోదీ స్పందిస్తూ, "ప్రధాని షినవత్రా నాకు తిపిటకను బహుమతిగా ఇచ్చారు. లార్డ్ బుద్ధుని పుణ్యభూమి అయిన భారతదేశం తరపున నేను దానిని వినయంగా స్వీకరించాను. గత సంవత్సరం, భారతదేశం లార్డ్ బుద్ధుని పవిత్ర అవశేషాలను, ఇద్దరు ప్రధాన మతగురువులను థాయ్‌లాండ్‌కు పంపింది. దాదాపు నాలుగు మిలియన్ల మంది ప్రజలు ఆ అవశేషాలకు నివాళులర్పించారని తెలుసుకోవడం చాలా సంతోషంగా ఉంది" అని అన్నారు. థాయ్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, థాయ్‌లాండ్ రాజులు బౌద్ధమత సంరక్షకులుగా ఉండటంతో పాటు, తిపిటకను ఇతర దేశాలకు వ్యాప్తి చేయడంలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు.

## మొదటిపేజీ తరువాయి

# ట్రంప్ టారిఫ్ బాంబ్.. భారత్‌లో ఈ రంగాలపై ఎఫెక్ట్

ఎగుమతులు జరుగుతున్నాయి. దీంతో పాటు ప్రాసెస్డ్ ఫుడ్, చక్కెర, కోకో ఎగుమతులపై ప్రభావం పడనుంది.

**టెక్స్‌టైల్స్, బంగారం..** భారత్ నుంచి ఏటా 11.88 బిలియన్ డాలర్ల విలువైన బంగారం, వెండి, వజ్రాభరణాలు అగ్రరాజ్యానికి ఎగుమతి అవుతున్నాయి. తాజా పెంపుతో వీటిపై సుంకం 13.32 శాతానికి చేరనుంది. దీంతో అమెరికాలో ఆభరణాల ధరలు పెరగనున్నాయి. ఇక, జౌళి పరిశ్రమ పైనా అధిక ప్రభావమే పడనుంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మన దేశం నుంచి 9.6 బిలియన్ డాలర్ల విలువైన దుస్తులు, ఇతర టెక్స్‌టైల్ ఫ్యాబ్రిక్స్ ఎగుమతి అవుతున్నాయి. మనం చేసే మొత్తం టెక్స్‌టైల్ ఎగుమతుల్లో 28 శాతం అమెరికాకే వెళ్తున్నాయి.

**చెప్పులపైనా..** పాదరక్షల పరిశ్రమ పైనా సుంకాల ప్రభావం ఉండనుంది. మన దేశం నుంచి 457.66 మిలియన్ డాలర్ల విలువైన ఫుట్‌వేర్ ఉత్పత్తులు యూఎస్‌కు ఎగమతి అవుతున్నాయి. వీటిపై అమెరికా-భారత్ మధ్య సుంకాల వ్యత్యాసం 15.56 శాతంగా ఉంది. దీంతో అగ్రరాజ్య మార్కెట్లో మన చెప్పుల ధరలు మరింత ప్రియం కానున్నాయి. దీంతో కస్టమర్లు ఇతర దేశాల ఉత్పత్తులను ప్రత్యామ్నాయంగా ఎంచుకునే అవకాశం ఉంది.

**ఎలక్ట్రానిక్స్..** ఎలక్ట్రానిక్స్, టెలికాం రంగాన్ని చూస్తే.. 2024లో 14.39 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులు మన దేశం నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యాయి. ఇప్పుడు సుంకాల పెంపుతో యూఎస్ మార్కెట్‌లో భారత ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల ధరలు పెరగనున్నాయి. ఇక, బాయిలర్లు, టర్బైన్స్, కంప్యూటర్ల వంటి ధరలు కూడా ప్రియమవుతాయి.

# సంచలనాల ట్రంప్.. అమెరికాలో మాంద్యం తప్పదా..?

ఇలాంటి సమయంలో అందరూ ఊహించిన దానికంటే ఎక్కువగా టారిఫ్‌లు ప్రకటించి సంచలనం సృష్టించారు. వీటి ప్రభావంతో వినియోగ ఆర్థికవ్యవస్థకు కొత్త చిక్కులు ఎదురుకానున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. ట్రంప్ ప్రకటనతో స్టాక్ మార్కెట్లు కుదేలయ్యాయి. అమెరికా సహా అన్ని ప్రధాన మార్కెట్లు పతనమవుతున్నాయి.

అమెరికా గ్రేట్ అగైన్ నినాదంతో అధికారంలోకి వచ్చిన ట్రంప్ నుంచి వృద్ధి అనుకూల విధానాలపై ప్రకటనలు వస్తాయని ఆశించిన పెట్టుబడిదారులు టారిఫ్ హెచ్చరికలతో ఆందోళనకు గురయ్యారు. ఇక తాజా ప్రకటనతో కంగుతిన్నారు. "ఈ ప్రకటన మార్కెట్లకు దారుణమైన పరిస్థితి. అమెరికాను మాంద్యంలోకి పంపే అవకాశం ఉంది. అందుకే ఫ్యూచర్స్ చాలా బలహీనంగా ఉన్నాయి" అని క్యాపిటల్ మార్కెట్ కంపెనీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ క్యాపిటల్ అడ్వైజర్స్ సీఈఓ జేహాట్‌ఫీల్డ్ వెల్లడించారు.

"ఈ మొత్తం స్టోరీలో మనం ఒకవైపే చూస్తున్నాం. కానీ.. మనం చేస్తున్న దానికి ఇతర దేశాలు ఎలా స్పందిస్తాయన్నది ముఖ్యం. అయితే, మొత్తంగా మార్కెట్ ఈ పరిస్థితులను ఎలా తీసుకుంటుందో చూడాలి" అని గ్రీన్‌వుడ్ క్యాపిటల్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ వాల్టర్ టాడ్ అభిప్రాయం వ్యక్తంచేశారు. "ప్రస్తుతం మేం అత్యంత బలహీనమైన స్థానంలో ఉన్నాం. ఈ పరిస్థితులు సడెన్ రికవరీ లేక బ్రేక్‌డౌన్‌కు మమ్మల్ని సిద్ధంగా ఉంచుతుంది" అని ఇంటరాక్టివ్ బ్రోకర్స్ చీఫ్ స్ట్రాటజిస్ట్ స్టీవ్ సోస్‌నిక్ అంచనా వేశారు. ట్రంప్ టారిఫ్ హెచ్చరికలు మొదలుపెట్టిన దగ్గరినుంచి.. అమెరికాకే నష్టం జరుగుతోందన్న అంచనాలు వెలువడ్డాయి. విదేశాల నుంచి వస్తోన్న వస్తువులపై పన్నులు విధించడం వల్ల వాటి ధరలు పెరిగి, అమెరికా పౌరులకే నష్టం వాటిల్లుతుందనే భయాలు నెలకొన్నాయి. అయితే ఇటీవల ద్రవ్యోల్బణం పెరుగుతుందన్న వాదనను కొట్టిపారేసిన ట్రంప్.. ఆర్థికమాంద్యం వస్తోందన్న అంచనాలను మాత్రం తోసిపుచ్చలేదు. అంతిమంగా అమెరికాకే మేలు జరుగుతుందని వ్యాఖ్యానించారు.

ట్రంప్ టారిఫ్‌లపై స్వదేశం, విదేశాల నుంచి ఇంత వ్యతిరేకత వ్యక్తం అవుతోన్నా.. ఆయన మాత్రం ఎవరినీ పట్టించుకోవడం లేదు. చైనా, వియత్నాం, మెక్సికో, తైవాన్, జపాన్, కెనడా, దక్షిణ కొరియా, ఇండియా, థాయ్‌లాండ్ తదితరాలతో పాటు యూరోపియన్ యూనియన్ దేశాలతోనూ అమెరికాకు భారీ వాణిజ్య లోటు ఉంది. దాన్ని పదేపదే ప్రస్తావించిన డొనాల్డ్ ట్రంప్- దిగుమతులపై ప్రతీకార సుంకాల ద్వారా వేల కోట్ల డాలర్ల అదనపు ఆదాయాన్ని రాబట్టాలని భావిస్తున్నారు. తన ఎన్నికల వాగ్దానమైన పన్నుల కోతలను అమలుచేయడానికి ఈ నిధులను వినియోగించుకోవాలన్నది ఆయన ఆలోచనగా చెబుతున్నారు.

# విమానం అత్యవసర ల్యాండింగ్.. తుర్కియేలో చిక్కుకున్న 200 మంది భారతీయులు

ప్రయాణికులు చెప్పారు. దాంతో దాదాపు 20 గంటలుగా ప్రయాణికులు అక్కడే చిక్కుకుపోయారు. వారిలో 200 మందికిపైగా భారతీయులున్నారని మీడియా కథనాలు తెలిపాయి. అయితే తిరిగి వారు ఎప్పుడు గమ్యస్థానం చేరతారనే దానిపై స్పష్టత లేదు. ప్రత్యామ్నాయ ఏర్పాట్ల గురించి విమానయాన సంస్థ నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు. అయితే ప్రస్తుతం ఎదురైన సమస్యను పరిష్కరించేందుకు కావాల్సిన సౌకర్యాలు ఆ విమానాశ్రయంలో లేవని ఓ ప్రయాణికుడు వెల్లడించారు. సాధ్యమైనంత త్వరగా రవాణా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కోరారు. తమకు విమానాశ్రయంలో తగిన సౌకర్యాలు లేవని, అది మిలిటరీ బేస్ కావడంతో అక్కడి నుంచి బయటకు వెళ్లడానికి కూడా లేదని తెలిపారు.


# పేదలకు "పట్టా" భిషేకం

సిద్ధమవుతున్నాయని, శ్మశాన వాటికలు అభివృద్ధి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. త్వరలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని, చేనేతలకు కామన్ ఫెసిలిటీ సెంటర్, స్వర్ణకారులకు జెమ్స్ అండ్ జ్యువెలరీ పార్కు ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. మంగళగిరిని తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా మారుస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.






## విజయలక్ష్మి చిత్ర పటానికి నివాళులర్పించిన చేజర్ల



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 3)

కోవూరు మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి సోదరి,విడవలూరు మాజీ సర్పంచి మాతూరు విజయలక్ష్మి ఉత్తర క్రియలు సందర్భంగా గురువారం కోవూరు నియోజకవర్గం విడవలూరు లోని వారి నివాసంలో, ఆమె చిత్ర పటానికి నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులను తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర రెడ్డి పరామర్శించారు.


## డాక్టర్ స్వర్ణ గీతను కలిసి శుభాకాంక్షలు తెలిపిన టిఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి షేక్ గౌస్ భాష



(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 3)

ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యురాలుగా ఎన్నికై ప్రమాణస్వీకారం చేసిన డాక్టర్ స్వర్ణ గీతను పొదిలిలోని ఆమె నివాసంలో గురువారం టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ గౌస్ భాష మర్యాదపూర్వకంగా కలిశారు. పూల బొకే అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గౌస్ భాష మాట్లాడుతూ మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని, ప్రజలందరికీ ఎప్పుడు అందుబాటులో ఉండాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

## గుండె పోటుతో పాస్టర్ మృతి



(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, ఏప్రిల్ 3)

గుండెపోటుతో పాస్టర్ మృతి చెందిన ఘటన పుల్లల చెరువు మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం పుల్లలచెరువు మండలం ఎస్సీ పాలెంకు చెందిన వేము మాణిఖ్యరావు గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. పాస్టర్ మాణిఖ్యరావుకు గురువారం ఉదయం గుండెలో నొప్పి రావడంతో ఆర్ ఎంపీ డాక్టర్ దగ్గరకి తీసుకెళ్లగా, పరిస్థితి విషమంగా ఉందని ఆర్ఎంపి చెప్పడంతో హుటహుటిన వినుకొండలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మరణించాడు.

# వృద్ధాప్యంలో ఉన్నవారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు

### ఆల్ ఇండియా పోస్టల్ ఆర్ఎంఎస్ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ జాతీయ నాయకులు మోహన్‌రావు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 3)

కేంద్ర ప్రభుత్వ శాఖలలో పని చేస్తూ పదవి విరమణ పొందిన ఉద్యోగులకు ఓకే పెన్షన్ ఒకే విధానాన్ని అమలు చేస్తామన్న కేంద్ర ప్రభుత్వ మాటలు అమలు కాకుండా ఉన్నాయని ఆల్ ఇండియా పోస్టల్ ఆర్ఎంఎస్ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ జాతీయ నాయకులు మోహన్ రావు అన్నారు. ఒంగోలు నగరంలోని పెద్ద పోస్ట్ ఆఫీస్ వద్ద పోస్టల్ రిటైర్డ్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కేంద్ర సర్వీసులో పనిచేసిన ఉద్యోగులకు పెన్షన్ విధానాన్ని ఇటీవల జరిగిన పార్లమెంటు సమావేశాల్లో ప్రత్యేకమైన బిల్లును తీసుకొచ్చి వృద్ధాప్యంలో మమ్మల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి కొనసాగుతున్న ఈ ప్రక్రియను పార్లమెంటులో చట్టం చేసి రావటం ద్వారా రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ నష్టపోయే అవకాశం ఉందని ఆ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకొని వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ బిల్లును వెనుక్కు తీసుకోకపోతే దేశవ్యాప్తంగా పెన్షనర్ ఉద్యోగులు ఆందోళనకు దిగుతామని వారి కుటుంబ సభ్యులతో అవసరమైతే నిరసన కార్యక్రమాలు ఎక్కువగా చేపడుతామని అన్నారు. 2014లో ఆనాడు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న ఆందోళనకు మద్దతు తెలియజేసి మీ పెన్షన్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చి ఆ హామీని ఇప్పుడు తుంగలో తొక్కారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కే వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి పేరయ్య, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఎస్పీ దామోదరకు శుభాకాంక్షలు తెలిపిన పొన్నలూరు మండల టిడిపి నాయకులు




(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 3)

స్థానిక పోలీస్ స్టేషన్‌కు గురువారం ఎస్పీ ఏఆర్ దామోదర్ సందర్శించగా విషయం తెలుసుకున్న మండలంలోని టిడిపి నాయకులు స్వాగతం పలికి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ దామోదర్ ప్రజా ప్రతినిధులతో మాట్లాడుతూ భద్రత దృష్టి ఏమైనా సమస్యలు ఉంటే మా పోలీస్ సిబ్బందికి తెలియపరిస్తే వెంటనే వాటిని పరిష్కరిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, మాజీ ఎంపీపీ కొండ్రగుంట శ్రీనివాసరావు, మాజీ టిడిపి అధ్యక్షుడు మండవ ప్రసాద్, కర్ణ కోటిరెడ్డి, మండవ మురళీమోహన్, అనుమోలు సుధాకర్, మండల టిడిపి ఉపాధ్యక్షుడు తానికొండ మహేంద్ర, నేలపాటి బ్రహ్మయ్య చౌదరి, కే అగ్రహారం సర్పంచ్ చిన్న మస్తాన్, ఎంపీటీసీ రామాంజనేయులు, రమణయ్య, దాసరి కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.









# గంగవరం టీడీపీ కార్యకర్త వాసిలీ కొండసామి ఉత్తర క్రియలకు హాజరైన చేజర్ల

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 3)

కోవూరు మండలం గంగవరం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త వాసిలీ కొండసామి ఉత్తర క్రియలు సందర్భంగా గురువారం తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర్ రెడ్డి, గంగవరంలోని వారి నివాసంలో వారి చిత్ర పటానికి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరి వెంట తెలుగుదేశం పార్టీ నాయకులు బుదవరపు శివకుమార్, కోరం చంద్రారెడ్డి, ఇంటూరు విజయ్, తదితరులు ఉన్నారు.



షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com
3 | 04.04.24 శుక్రవారం

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం

# అదిగో పులి

# పులి ఆహారానికి పెను ముప్పు

## పులుల సంతతికి అనుగుణంగా పెరగని ఆహార లభ్యత
## నల్లమలలో వేటగాళ్ల స్వైర్య విహారం..అడుగడుగునా ఉచ్చులు
## తగ్గుతున్న దుప్పులు, కణుతుల సంఖ్య



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం డివిజన్ ఇన్‌ఛార్జి, ఏప్రిల్ 3)

యర్రగొండపాలెం మండలంలోని దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో గల కొలుకుల, గంజివారిపల్లి గ్రామాల పరిసర ప్రాంతాల్లో గత వారం రోజులు కిందట పెద్దపులి సంచరించింది. ఆహారం కోసం అడవిని వదిలి గ్రామాల బాట పట్టింది. దానిని పొలాలకు వెళ్లే రైతులు చూసి భయాందోళనకు గురయ్యారు. ఒంటరిగా పొలాలకు వెళ్లేందుకు జంకుతున్నారు. రాత్రిపూట పొలాలకు వెళ్లడమే మానుకున్నారు. అటవీ శాఖ కాలిముద్రలను గుర్తించింది. సీసీ పుటేజ్‌ల ద్వారా పెద్దపులి అటవి లోతట్టు గ్రామాల్లో సంచరిస్తున్నట్లు గురించీరు. ఈ నేపధ్యంలో అటవీ లోతట్టు గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తూ అవగాహన కల్పిస్తున్నారు. ఒంటరిగా పొలాలకు వెళ్లవద్దని సూచిస్తున్నారు. ఈ నేపధ్యంలో ప్రత్యేక కథనం..

**దట్టమైన నల్లమల అటవిలో**

దేశంలోనే విస్తీర్ణంలో అతి పెద్దదైన పెద్దపులుల అభయారణ్యం శ్రీశైలం-నాగార్జున సాగర్ టైగర్ రిజర్వ్ (ఎన్ఎస్‌టీఆర్). అలాంటి చోటే వాటికి పెను ముప్పు ఎదురవుతోంది. పెరుగుతున్న పులుల సంతతికి తగ్గట్టు ఆవాసం, ఆహార లభ్యత దొరకడం లేదు. వీటి ప్రధాన ఆహార జంతువులైన దుప్పులు, కణుతుల సంఖ్య పెరగకపోగా రోజురోజుకు వాటి సంఖ్యలో తరుగుదల కనిపిస్తోంది. ఇందుకు అటవీ పరిధిలో వేటగాళ్లు మాటు వేయడం, వారిని కట్టడి చేసే స్థాయిలో సిబ్బంది సంఖ్య లేకపోవడంతో ఎంతో భద్రమైనదిగా భావించే నల్లమలలోనే వాటి సంరక్షణ గాలిలో దీపంలా మారింది. అటవీ ఆవరణ వ్యవస్థలో అగ్ర భాగాన ఉండే పెద్దపులులు అధికారిక లెక్కల ప్రకారం శ్రీశైలం-నాగార్జున సాగర్ టైగర్ రిజర్వ్‌లో 92 ఉన్నాయి. అయితే పులులు పెరిగే కొద్ది వాటి ఆవాస ప్రాంతం, ఆహార లభ్యత పెరగడం లేదు. ఇందుకు తగినన్ని గడ్డి మైదానాలు అభివఅద్ధి కాలేదు. పులుల ప్రధాన ఆహార జంతువుల సంఖ్య పెరగడమూ లేదు. నల్లమలలోని ఆత్మకూరు, నంద్యాల, గిద్దలూరు, మార్కాపురం డివిజన్‌లో వేటగాళ్ల కదలికలు రోజురోజుకు పెరుగుతుండడమే అందుకు ప్రధాన కారణమని తెలుస్తోంది. అటవీ సమీప గ్రామాల్లో తిష్టవేసిన కొందరు వేటగాళ్లు గడ్డితినే జంతువులు సంచరించే నీటివనరుల వద్ద, జేడ (సాల్ట్ లీక్)మైదానాల వద్ద ఉచ్చులు వేసి మాటు గాస్తున్నారు. ఆ ఉచ్చులకు చిక్కిన వన్యప్రాణులను మాంసంగా మార్చి పట్టణాల్లో పెద్ద మొత్తానికి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

**ప్రమాదకర స్థితిలో పులి..**

ఎంతో భద్రమైనదని భావించే ఎన్ఎస్‌టీఆర్‌లో ప్రాణాంతక వైరస్‌లా వేటగాళ్ల చొరబాటు పెరుగుతోంది. ఇందుకు ప్రధాన కారణం సిబ్బంది కొరతేనన్నది విస్పష్టం. ఎన్ఎస్‌టిఆర్ సర్కిల్లో మొత్తం నాలుగు డివిజన్లలో తక్కుత మంది సిబ్బందే ఉన్నారు. ఈ అరకొర సిబ్బందితో వేటగాళ్లను నియంత్రించ లేని పరిస్థితి, ఫలితంగా పులి సంరక్షణ ప్రమాదకర స్థితిలో పడింది. అటవీ సంరక్షణలో రోజువారి ఫుట్ పెట్రోలింగ్ (కాలి నడకతో ప్రదేశాన్ని చుట్టి రావడం)కు కూడా సిబ్బంది కొరతే ప్రధాన అడ్డంకిగా ఉంది. సుమారు 3,750 చకిమీ విస్తీర్ణంలో ఉన్న విశాలమైన ఎన్ఎస్‌టీఆర్ ఫుట్ పెట్రోలింగ్‌కు ఉన్న వనరులు కేవలం బేస్ క్యాంప్ సిబ్బంది మాత్రమే. మిగతా వారిని ప్రత్యేకించి ఫుట్ పెట్రోలింగ్‌కు కేటాయించలేని పరిస్థితి. ప్రొటెక్షన్ వాచర్లను పర్యవేక్షించేందుకు ఒక్కో బేస్ క్యాంపులో ఒక రెగ్యులర్ అటవీ సిబ్బంది ఉండాలి. ఈ రూల్ పుస్తకాలకు మాత్రమే పరిమితమైంది.



**వేధిస్తోన్న ఆహార కొరత..**

శ్రీశైలం-నాగార్జున సాగర్ టైగర్ రిజర్వ్‌లో ఉన్న ఆహార లభ్యతను బట్టి ఒక్కో పెద్దపులి తన ఆధీన ప్రాంతం (టెరటరీ)గా సుమారు 40 చకిమీ పరిధిని ఉంచుకుంటోంది. పులి సాధారణంగా ఆరుసార్లు దాడులు చేస్తే ఒకసారి వేట సాఫల్యమవుతుంది. ఇందుకోసం అది ఆరు రోజులు కూడా ఆకలితో నకనకలాడాల్సి ఉంటుంది. కనీసం వారానికో జంతువును వేటాడినా ప్రస్తుతం నల్లమలలో ఉన్న పులులకు వారానికి సుమారు 90 ఆహార జంతువులు అవసరమవుతాయి. నెలకు 360, సంవత్సరానికి దరిదాపుగా నాలుగు వేలకు పైగా జంతు వులు అందుబాటులో ఉండాలి. ఇది కనిష్ట అవసర స్థితి. ఈ నిష్పత్తిలో ఆహార లభ్యత లేక పోతే పులుల అధీన ప్రాంతం క్రమేపీ పెరుగుతుంది. దీంతో పులుల మధ్య ఆహారం కోసం యుద్ధాలు జరుగుతాయి. ఈ పోరులో ఎన్నో పులులు మరణించే అవకాశం ఉంది. ఇలాంటి సంక్లిష్ట పరిస్థితుల్లో పులి ఆహారం వేటగాళ్ల చౌర్యానికి గురైతే జరిగే నష్టం లెక్క కట్టలేనిది. ఈ నేపధ్యంలో ఆహారం కోసం పులులు అటవీ లోతట్టు గ్రామాలకు వస్తున్నాయి. అటవీ శాఖాధికారులు ఇప్పటికైనా వాటివల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా, వాటికి కూడా ఎలాంటి అపాయం కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

---

**బ్యాంకర్లను కోరిన జిల్లా కలెక్టర్ ఎ తమీమ్ అన్సారియా**

# ప్రజల అభ్యున్నతికి ఆర్థిక తోడ్పాటు అందించాలి





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 3)

బీసీ, ఈబీసీ, కాపు యాక్షన్ ప్లాన్ కింద బ్యాంకులకు కేటాయించిన లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేసి ఆయా వర్గాల ప్రజల అభ్యున్నతికి తమ వంతు ఆర్థిక తోడ్పాటు అందించాలని జిల్లా కలెక్టర్ ఎ తమీమ్ అన్సారియా బ్యాంకర్లను కోరారు. గురువారం ఉదయం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, బిసి కార్పోరేషన్ అధికారులు, వివిధ బ్యాంకుల అధికారులతో సమావేశమై, బిసి కార్పోరేషన్ ద్వారా బిసి, రెడ్డి, క్షత్రియ, కమ్మ, ఈబిసి, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, కాపు వర్గాలకు స్వయం ఉపాధి పథకాల కింద మంజూరు చేసిన వివిధ యూనిట్స్ గ్రౌండింగ్ పురోగతి పై సమీక్షించి పలు సూచనలు చేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో బిసీ, రెడ్డి, క్షత్రియ, కమ్మ, ఈబిసి, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, కాపు వర్గాలకు స్వయం ఉపాధి పథకాల కింద 1,864 యూనిట్స్ మంజూరుకు సంబంధించిన దరఖాస్తులను జిల్లాలోని వివిధ బ్యాంకులకు పంపడం జరిగిందన్నారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు ఈ నెల 9వ తేదీ లోపు సుమారు వెయ్యి యూనిట్స్ గ్రౌండింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, బ్యాంకర్ల ను ఆదేశించారు. ఈ నెల 11వ తేదీన జరిగే మహాత్మా జ్యోతి రావు పూలే జయంతి రోజున సంబంధిత లబ్దిదారులకు యూనిట్స్ మంజూరు ఉత్తర్వులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, బిసి కార్పోరేషన్ అధికారులను ఆదేశించారు. బ్యాంకర్లు తమకు కేటా యించిన లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేసిన ఆయా పేద వర్గాల ప్రజల అభ్యున్నతికి తమ వంతు సహకారం అందించాలన్నారు. ప్రతి బ్యాంకుకు ఇచ్చిన లక్ష్యాల మేరకు పథకాలు మంజూరు చేసి, గ్రౌండింగ్ అయ్యేలా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో బిసి కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు, ఎల్‌డిఎం రమేష్, బ్యాంకర్లు, తదితరులు పాల్గొన్నారు.

---

# మహిళల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి

**ఎస్పీ ఏ ఆర్ దామోదర్**

(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 3)

శాంతి భద్రతుల పరిరక్షణ, మహిళ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషను గురువారం ఎస్పీ దామోదర్ సందర్శించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ నేరాల కట్టడి, రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, టెక్నాలజీ పై అవగాహన పెంచుకుంటూ వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ పోలీస్ శాఖపై మరింత నమ్మకం పెంపొందించాలా ఉత్తమ సేవలు అందించాలని అన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ యొక్క పరిసర ప్రాంతాలను, పోలీస్ స్టేషన్ నిర్వహిస్తున్న విధానాన్ని పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించి, నమోదైన కేసులను త్వరితగతిన పరిష్కారమయ్యేలా చూడాలని, కేసుల పరిష్కారంలో జాప్యం వహించే కొలది బాధితులకు సత్వర న్యాయం అందించలేమని దానికి అనుగుణంగా పోలీస్ స్టేషన్‌ల యొక్క నిర్వహణ ఉండాలని సూచించారు. పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అందరితో మాట్లాడుతూ అందరి యొక్క ఆరోగ్య పరిస్థితులను గురించి ఆరా తీశారు. వృత్తిపరంగా, ఆరోగ్యవరంగా, కుటుంబ వరంగా ఏమైనా సమస్యలు ఎదుర్కొంటున్నది, మొదలైన విషయాలను వారితో ముఖాముఖి మాట్లాడారు. సిబ్బంది




సంక్షేమానికి ఎల్లవేళలా కృషి చేస్తామన్నారు. క్రికెట్ బెట్టింగ్, శక్తి యాప్, మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, సీసీ కెమెరాల యొక్క ప్రాముఖ్యత గురించి ప్రజలకు తెలియచేసి సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. పోలీసులపై ప్రజలకు నమ్మకం కలిగించే విధంగా పనిచేయాలని,

---

# రాజకీయాలకు అతీతంగా యువతకు ఉపాధి

## భావదారిద్ర్యం నుంచి బయటపడాలి
## ఎగువ పల్నాడు పారిశ్రామికంగా ఎదుగుతోంది
## మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి





(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, ఏప్రిల్ 3)

ఎన్డీఏ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాజకీయాలకు అతీతంగా యువతకు 20 లక్షల ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎస్‌కేబీఆర్ డిగ్రీ కళాశాల నందు ప్రపంచ ప్రఖ్యాత పారిశ్రామిక దిగ్గజం అమర రాజా సంస్థ ఆధ్వర్యంలో జేబీఆర్ మెగా జాబ్ మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. యువత భావదారిద్ర్యం నుంచి బయటపడి, ప్రపంచ స్థాయి ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని అందిపుచ్చుకోవాలని సూచించారు. ఎంతో కష్టపడి చదివించిన తల్లిదండ్రులకు బాసటగా నిలవాలని కోరారు. యువత ఉపాధే లక్ష్యం, సేవా ధృక్పంథంతో మాజీ ఎంపీ గల్లా జయదేవ్ (తరువాయి 4లో...)

# రాజకీయాలకు అతీతంగా యువతకు ఉపాధి

అమర రాజ సంస్థను స్థాపించి, వేల మందికి ఉపాధినిచ్చి, ఆదుకుంటున్నారని వివరించారు. రాజకీయాల్లో సేవే ప్రధానం అని చాటి చెప్పిన గల్లా జయదేవ్ అందరికీ స్ఫూర్తి అని కొనియాడారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గల్లా కుటుంబం చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. మాచర్ల నియోజకవర్గం యువత కోసం ప్రాథమికంగా 10 వేల ఉద్యోగాల కల్పనకు అనేక పరిశ్రమలు, ఐటీ కంపెనీలతో ఇప్పటికే మాట్లాడటం జరిగిందన్నారు. అమర రాజాలాంటి మంచి సంస్థలు ఇస్తున్న ఉద్యోగ అవకాశాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

**గత అరాచక పాలనలో యువత రోడ్డున పడ్డారు**

గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకం వలన అమరరాజ కంపెనీ పక్కరాష్ట్రలకు తరలివెళ్ళిందని, తద్వారా దాదాపు 10 వేల మంది యువత ఉద్యోగం లేక రోడ్డున పడ్డారని ఎమ్మెల్యే జూలకంటి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీలో ఎన్డీయే ప్రభుత్వ పాలన ప్రారంభమైన అతి తక్కువ సమయంలోనే పరిశ్రమలకు స్వర్గధామంలా ఇక్కడ పరిస్థితులను చక్కదిద్దుతున్నారని ఆయన చెప్పారు. దోచుకోవడం, దాచుకోవడం, పంచుకోవడం మాత్రమే తెలిసిన జగన్ రెడ్డికి అభివృద్ధిలో అవినీతి చూడడం బాగా తెలుసు అని ఎద్దేవా చేశారు.

**పల్నాడు పారిశ్రామికంగా ఎదుగుతోంది!**

పల్నాడు ప్రాంతం పారిశ్రామికంగా పురోగమించేందకు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఎంతో కృషిచేస్తున్నారని, ఆయనతో కలిసి ఎన్నో పరిశ్రమల స్థాపలనకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఎమ్మెల్యే జూలకంటి వెల్లడించారు. ప్రాంతాలు పారిశ్రామికంగా ఎదిగినప్పుడే యువతకు స్థానికంగా ఉపాధి దొరకుతోందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం పరిశ్రమల స్థాపనకు సింగిల్ విండో సిస్టమ్ తీసుకోచ్చిందని ఆయన పేర్కొన్నారు. మాచర్ల నియోజకవర్గం వ్యాపార,పారిశ్రామిక రంగాలు ఉన్నతంగా ఎదగాలని, అందుకు తగిన మౌలిక వసతులను సిద్ధం చేస్తున్నట్లు ఈ సందర్భంగా చెప్పారు.

అనంతరం మెగా జాబ్ మేళాలో 600 మంది నిరుద్యోగ యువత రిజిస్ట్రేషన్ చేసుకోగా, ఎంపికైన 380 మంది ఎమ్మెల్యే జూలకంటి చేతులమీదిగా కంపెనీ ఎంపికా ధృవపత్రాలను అందుకున్నారు.

# 5న డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి మహోత్సవం

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 3)**

డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి మహోత్సవం పురస్కరించుకొని సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీన జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్ ప్రకాశం జిల్లా, ఒంగోలు వారిచే, ఉదయం 10గంటలకు ఒంగోలులోని నెల్లూరు బస్టాండ్ వద్ద ఉన్న డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పుష్పమాలాంకరణ, ఉదయం 10.15 గంటలకు డాక్టర్ బీఆర్.అంబేద్కర్ భవనమునకు వెళ్లే దారిలో ఉన్న డా.బాబు జగ్జీవన్ రామ్ కాంస్య విగ్రహానికి పుష్పమాలాంకరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఉదయం 10.30 గంటలకు డా.బి.ఆర్. అంబేద్కర్ భవనంలో జ్యోతి ప్రజ్వలన, ప్రార్థన, డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ చిత్ర పటమునకు పుష్పమాలాంకరణ, ఉదయం 10.40 గంటలకు గౌరవ అతిథుల ఉపన్యాస కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, షెడ్యూల్డ్ కులముల షెడ్యూల్డ్ తెగల సంఘ నాయకులు, ప్రజలు, మీడియా మిత్రులు ఈ నెల 5వ తేదీన జరిగే డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి మహోత్సవ సభకు విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు.


# ఏపీ మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ స్వర్ణ గీతకు శుభాకాంక్షలు



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 3)**

ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ మెంబర్‌గా డాక్టర్ స్వర్ణ గీత ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా గురువారం పొదిలిలోని ఆమె నివాసంలో పొదిలి మాజీ ఉప సర్పంచ్ షేక జిలాని డాక్టర్ స్వర్ణ గీతను మర్యాదపూర్వకంగా కలిసి శాలువ కప్పి, బొకే అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు పొంది ప్రజలకు మంచి సేవలు అందించాలని ఆకాంక్షించారు.

# షబ్బీర్‌కు సత్కారం



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 3)**

పొదిలి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా షేక్ షబ్బీర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం హబీబుల్లా బేగ్ సేవా సంస్థ చైర్మన్ కరిముల్లా బేగ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పూల మాల వేసి ఘనంగా సత్కరించి, మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కరిముల్లా బేగ్ మాట్లాడుతూ ప్రభుత్వ న్యాయవాదిగా మెరుగైన సేవలు అందించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముల్లా మదర్‌వలి, ముల్లా ఇబ్రహీం, హబీబుల్లా బేగ్ సేవా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# అకుంఠిత దీక్షతో వరిక పూడిసెలను పూర్తి చేస్తారు



**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, ఏప్రిల్ 3)**

అకుంఠిత దీక్షతో వరికపూడిసెలను మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి నేతృత్వంలో పూర్తి అవుతుందని తెలుగుదేశం పార్టీ యువ నాయకులు జూలకంటి అక్కిరెడ్డి , గౌతమ్ రెడ్డిలు ఉద్ఘాటించారు. గురువారం మాచర్ల పట్టణం, మండాది రోడ్డులోని శ్రీ రామకృష్ణ సేవా సమిత ఆధ్వర్యంలో స్వామి వివేకానంద సేవాశ్రమంలో పదో తరగతి పూర్తయిన విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఉచిత కోచింగ్ సెంటర్ ను వారు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలకు పూర్తిగా సహకరిస్తామని, నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమమే ఎమ్మెల్యే జూలకంటి ప్రధాన లక్ష్యమని వారు వెల్లడించారు. పదో తరగతి పూర్తయిన విద్యార్థులందరూ పాలిటెక్నిక్, ఏపీఆర్జేసీ, స్పోకెన్ ఇంగ్లీష్ లకు సంబంధించిన ఈ ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. విద్యార్థుల కోసం అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న శ్రీ రామకృష్ణ సేవా సమితికి ఈ సందర్భంగా ఆర్థిక సహాయం ప్రకటించారు.అనంతరం గౌతమ్ రెడ్డి, అక్కిరెడ్డిలను శ్రీరామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివేకానంద ఆశ్రమ సిబ్బంది,తెలుగుదేశం పార్టీ మాచర్ల పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి

ఫిర్యాదులపై వేగంగా స్పందించాలని, ముఖ్యంగా పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని, నేరాల నియంత్రణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు . బైక్ మీద వెళ్లేటప్పుడు రహదారి భద్రత నియమాలు పాటిస్తూ తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకొని వెళ్ళమని చెప్పాలని, మహిళా పోలీస్‌లతో మాట్లాడుతూ వారి పరిధిలో ఉన్న ప్రజలతో నిత్యం మమేకం అవుతూ, వారి సమస్యలు తెలుసుకుంటూ వాటి పరిష్కరణలో తమ వంతు పాత్ర పోషించాలని పేర్కొన్నారు. సైబర్ నేరాలు, గుడ్ టచ్ బ్యాట్ టచ్, రోడ్డు భద్రత నియమాలు, క్రికెట్ బెట్టింగ్, శక్తి యాప్ మరియు మాదక ద్రవ్యాల పై ప్రజలకు మరియు విద్యార్థులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కనిగిరి డిఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, ఎస్ బి ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, కొండేపి సీఐ సోమశేఖర్, పొన్నలూరు ఎస్ఐ అనూక్, సిబ్బంది పాల్గొన్నారు.

# మండలంలో భారీ వర్షం



**(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, ఏప్రిల్ 3)**

మండలంలో ఒక్కసారిగా గాలి, ఉరుములతో, కూడిన భారీ వర్షం పడింది. సాయంత్రం 6 గంటల నుంచి వర్షం కురుస్తూనే ఉంది. విద్యుత్ సౌకర్యము లేక ప్రజలు చాలా అవస్థలు పడ్డారు. గ్రామాల్లో గాఢాంధకారం నెలకొంది. పిడుగులు పెద్ద శబ్దాలు రావడంతో ప్రజలు కొంత భయాందోళనకు గురయ్యారు.

## 29 లక్షలతో 41వ డివిజన్‌లో
# సీసీ రోడ్లు, డ్రైన్‌లకు శంకుస్థాపన

**రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి**

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 3)**



నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 41 డివిజన్‌లో 29 లక్షల రూపాయల వ్యయంతో సిసి రోడ్లు, డ్రైన్ల పనులకు శంకుస్థాపన చేశారు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మాజీ మేయర్ నంది మండలం భానుశ్రీలు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ప్రారంభించిన ప్రతి పనిని చెప్పిన మాట ప్రకారం సకాలంలో పూర్తి చేస్తున్నామన్నారు. అందుకు సహకరిస్తున్న అధికారులకు, కాంట్రాక్టర్లకు ధన్యవాదాలు తెలుపుతున్నామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీపడేది లేదు. అధికారులు నాణ్యతా ప్రమాణాల పై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఇప్పటికే పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి, అభివృద్ధి జరుగు తున్నప్పుడు ప్రజలు అందుకు సహకరించాలన్నారు. డివిజన్ పరిధిలో కొన్ని సమస్యలు స్థానికులు నా దృష్టికి తీసుకుని వచ్చారు. వాటిని కూడా త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కువ్వాకొల్లు విజయ లక్ష్మి, డివిజన్ అధ్యక్షులు పాలూరు నాగేశ్వరరావు, టిడిపి నాయకులు కువ్వాకొల్లు బాబ్జి, మజ్జారి రామకృష్ణ, సతీష్, బాలాజీ రెడ్డి, తంజావూరు వేణు, డ్యానీ, శరత్ , వెంకటేశ్వర్లు , ఉచ్చూరు సురేష్, వెంకటేశ్వర్లు ఆచారి, సుధాకర్, సుత్తారం సురేష్, ఆదోని వెంకటేశ్వర్లు, బాణాల వెంకటేశ్వర్లు,శివ ,కమలాకర్ మస్తానయ్య , గౌసియా , మందా పెద్ద బాబు, మందా బాబ్జి, పల్లాల రమణయ్య, పల్లాల మాతయ్య, నాగరాజు, శ్రీనివాసులు, గఫ్ఫార్, స్వప్న, సుజాత, భార్గవి, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



# నేడు మంత్రి కొలుసు పార్థసారథి పర్యటన

**హౌసింగ్ కాలనీలను పరిశీలించి సమీక్ష చేయనున్న మంత్రి**

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 3)**

రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు.శుక్రవారం ఉదయం 8.30 గంటలకు నెల్లూరు రూరల్ మండలం అల్లీపురంలోని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి నివాసానికి మంత్రి పార్థసారథి చేరుకుంటారు. అనంతరం 9.30 గంటలకు ఎమ్మెల్యే సోమిరెడ్డితో కలిసి తోటపల్లి గూడూరు మండలం వరిగొండ గ్రామంలోని హౌసింగ్ లేఅవుట్‌ను మంత్రి పరిశీలించి లబ్ధిదారులతో మమేకమవుతారు. ఉదయం 11:30 గంటలకు మంత్రి పార్థసారథి పొదలకూరు చేరుకుంటారు. పొదలకూరులో హౌసింగ్ లేఅవుట్ ను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడతారు. మధ్యాహ్నం ఒంటిగంటకు నెల్లూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. సమావేశం అనంతరం నెల్లూరు సంతపేట లోని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నివాసానికి చేరుకుంటారు. అక్కడ నుంచి ఆర్ అండ్‌బి అతిథి గృహానికి చేరుకుని సాయంత్రం 6 గంటలకు తిరుపతి జిల్లా గూడూరు సమీపంలోని ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకల్లో పాల్గొని మహర్షి మహేష్ యోజీజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. అక్కడి నుంచి రాత్రి 9 గంటలకు తిరుపతి ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ కు చేరుకుని హైదరాబాద్‌కు వెళతారు.

## రూ.14 లక్షలతో నిర్మిస్తున్న
# నూతన సిసి డ్రైన్ శంకుస్థాపన



**రూ.35 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు**

**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఏప్రిల్ 3)**

కందుకూరు పట్టణంలోని 2వ వార్డు ఉర్దూ స్కూల్ వద్ద 35 లక్షల రూపాయలతో నిర్మించిన నూతన సి.సి రోడ్ల ను గురువారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. 2వ వార్డు జనార్ధన కాలనీ పుట్ట వద్ద 14 లక్షలు రూపాయలతో నిర్మిస్తున్న నూతన సి.సి డ్రైన్ శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఎన్నికల హామీలో భాగంగా దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉర్దూ స్కూల్ రోడ్డుకు నిధులు కేటాయించి రోడ్డు నిర్మించి ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకి స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. పట్టణంలో ఇప్పటికే పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని, అభివృద్ధి జరుగుతున్నప్పుడు ప్రజలు అందరూ సహకరించాలి. 2వ వార్డు పరిధిలో కొన్ని సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని వచ్చారు. వాటిని కూడా త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, పట్టణ టిడిపి మాజీ అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు, ఉన్నం వీరస్వామి చిలకపాటి మధు, షేక్ రఫీ, బెజవాడ ప్రసాద్, ముచ్చు శ్రీను వడ్డెళ్ళ రవిచంద్ర, రావూరి రామకోటయ్య, వాకా రాజారెడ్డి స్థానిక నాయకులు షేక్ నాగూర్, కూనం నరేంద్ర, గద్దం మాలకొండయ్య, తుమాటి బ్రహ్మయ్య, మర్రిపూడి శ్రీను, కంద్రా మాలకొండయ్య, చుండూరి శ్రీను, పువ్వాడి కోటయ్య, ముచ్చు వేణు, పులి నాగరాజు, షేక్ మమ్ముషా, యర్రా ముసలయ్య, తిరుమలశెట్టి మధు, రామరాజు, వెంకాయమ్మ, షేక్ కాలేషా, మురళి, సుల్తాన్, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.







# వెలిగండ్ల పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ ఏఆర్ దామోదర్

- పలు రికార్డులు పరిశీలన - నమోదైన కేసుల పై ఆరా

ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ పోలీస్ శాఖపై మరింత నమ్మకం పెంపొందించేలా ఉత్తమ సేవలు అందించాలి

చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాల పై ప్రత్యేక నిఘా పెట్టి నివారించాలి












(షణ్ముఖ వెలుగు, వెలిగండ్ల, ఏప్రిల్ 3)

వెలిగండ్ల పోలీస్ స్టేషన్‌ను గురువారం ఉదయం తనిఖీ చేసి, పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి అనంతరం స్టేషన్లోని రికార్డ్సను పరిశీలించి కేసుల నమోదు వాటి యొక్క స్థితి గతులను తెలుసుకుని పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ ముందుగా స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. స్టేషన్‌లోని పలు రికార్డులను తనీఖీ చేయడంతో పాటు, స్టేషన్ పనీతీరుతో పాటు, స్టేషన్ పరిధిలో ఎలాంటి నేరాలు జరుగుతాయి, ఎంత మంది చెడు నడతగలిగిన వారు ఉన్నారు. స్టేషన్ సిబ్బంది మొదలైన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసుల పట్ల ప్రజలకు నమ్మకం కలిగించే విధంగా మరింత సమర్ధవంతంగా పనిచేయాలని, ఫిర్యాదుల పై వేగంగా స్పందించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తూ చర్యలు తీసుకోవాలని, నేరాల నియంత్రణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ సూచించారు. ప్రజలకు సిసి కెమెరాల పట్ల అవగాహన కల్పించి వాటి ప్రాముఖ్యతను వివరిస్తూ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. విలేజ్ పోలీస్ అధికారులు తరచు గ్రామాలు పర్యటిస్తూ ప్రజలతో మమేకం అవుతూ ముందస్తు సమాచారాన్ని సేకరించాలన్నారు. ప్రజలకు చట్టాల మీద, శక్తి యాప్, క్రికెట్ బెట్టింగ్, సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బంది అందరి కృషి చేయాలన్నారు. పోలీస్ స్టేషన్ తనిఖీల్లో భాగంగా అక్కడ పనిచేస్తున్న సిబ్బంది అందరితో కలిసి కూర్చుని తేనీరు సేవిస్తూ విధి నిర్వహణలో ఏమైనా సమస్యలు ఉన్నది, కుటుంబ నేపథ్యం అనారోగ్య సమస్యలు ఏదైనా ఉన్నది అడిగి తెలుసుకున్నారు. పోలీస్ సిబ్బందికి హెల్మెట్ లను అందచేశారు. పోలీస్ స్టేషన్ వచ్చే ఫిర్యారుదలపై తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని సిబ్బందికి సూచించారు.

**విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి**
**ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్**

వెలిగొండ లోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలోని విద్యార్థినిలతో జిల్లా ఎస్పీ ఇంట్లో, పాఠశాలల్లో, వీధుల్లో, పొరుగు వారితో ఎదురయ్యే వేధింపులు అసభ్య ప్రవర్తన గురించి నిర్భయంగా తల్లిదండ్రులకు తెలియచెప్పి వారి నుండి మొదట రక్షణ పొందాలని తెలిపారు. ఎలాంటి వాటిని నేరంగా పరిగణిస్తాము, ఎదుటివారు మనతో మెలిగే విధానం బట్టి వారు ఏ విధమైన ఆలోచనతో మనతో ప్రవర్తిస్తున్నారు? మన శరీరాన్ని తాకే విధానం బట్టి గుడ్ టచ్- బాడ్ టచ్ అంటే ఏమిటి, నేర ప్రవృత్తి కలిగి మనతో మెలుగుతున్నారా? లేదా మంచి ఆలోచనతో మనతో ఉంటున్నారా? ఏ విధంగా స్పర్శను బట్టి అంచనా వేయవచ్చు అనేదానిపై వివరంగా తెలియజేశారు. అంతేగాక చదువుకునే ప్రాంతంలో, బంధువుల ఇళ్ల వద్ద, మన చుట్టుపక్కల ప్రాంతాలలో మనతో అసభ్యంగా ప్రవర్తించేవారు ఎవరు, వారి నుండి మనల్ని మనం ఏ విధంగా రక్షించుకోవాలి, అలా ఎవరైనా మనపై దాడికి పాల్పడితే పోలీసుల నుండి రక్షణ ఏ విధంగా పొందాలి అనే అంశాలపై జిల్లా ఎస్పీ గారు అవగాహన కల్పించారు. మీరు ఎదుర్కొంటున్న సమస్యను ధైర్యంగా చెప్పినప్పుడే పూర్తి భద్రత అందించగలమని విద్యార్థుల్లో ధైర్యాన్ని నింపారు. సామాజిక మాధ్యమాల వినియోగం పెరుగుతున్న కొద్దీ అంతే వేగంగా సైబర్ నేరాల వలల్లో చిక్కుకుంటున్నారన్నారు. సమస్య వస్తే కుంగిపోకుండా ధైర్యంగా ఎదుర్కోవాలని సమస్య చిన్నదైనప్పటికీ తల్లిదండ్రులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తూ, వారి యొక్క సహాయం తీసుకోవాలని, దుర్బుద్ధితో కపట మాటలు చెప్పి, అవకాశం తీసుకునే వారి పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని, మాటల ప్రలోభాలకు గురికాకుండా చదువుపై దృష్టి కేంద్రీకరించాలని మరియు క్రీడలలో కూడా రాణించాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. స్పోర్ట్స్ విద్యార్థినిలకు స్పోర్ట్స్ డ్రెస్ ను జిల్లా ఎస్పీ గారు వారికి అందించారు. ఉపాధ్యాయులకు విద్యార్థుల పట్ల తీసుకోవలసి జాగ్రత్తలను సూచించారు. జిల్లా ఎస్పీ వెంట కనిగిరి డివస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, ఎస్ బి ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, పామూరు సీఐ భీమా నాయక్, సియస్ పురం పురం ఎస్సై సుమన్, వెలిగండ్ల ఏఎస్సై జిలాని భాష, కస్తూర్బా గాంధీ బాలికల ప్రిన్సిపాల్ సుశీల, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

# ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, ఏప్రిల్ 3)

వేసవి దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అఫీషియల్ చైర్‌పర్సన్ సిహెచ్ స్వరూప అన్నారు. పట్టణంలోని సాగర్ రోడ్డులో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. స్వరూప మాట్లాడుతూ ఈ యేడాది ముందుగానే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయన్నారు. వడదెబ్బ తగలకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో సొసైటీ బ్యాంక్ చీఫ్ మేనేజర్ కరుణాకర్ బాబు, మేనేజర్ బలరాంరెడ్డి, సూపర్వైజర్ టిసిహెచ్ అంజిరెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ టి నరసింహారావు, సీఈవో ఇనకంటే కోటయ్య, సూపరింటెండెంట్ షేక్ రహంతుల్లా, సోమరౌతు బ్రహ్మేశ్వరరావు, రాజసాగర్‌రెడ్డి, కోటిరెడ్డి, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లోగ్రేడు, హీట్ ఉన్న బేల్స్‌ను పొగాకు వేలం కేంద్రానికి తీసుకొని రావద్దు

(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మార్చి 3)

ఒకటో నెంబర్ వేలంకేంద్రంకి గురువారం వేలం నిర్వహణ అధికారి ఎం కిరణ్ పొగాకు రైతులకు పత్రికా ప్రకటన ద్వారా సూచనలు తెలిపారు. ఏ ఒక్క పొగాకు రైతు కూడా పొగాకు చెక్కులను లో గ్రేడు, హీట్ ఉన్న, డామేజ్ ఉన్న బెల్స్ ను వేలం కేంద్రానికి తీసుకురావద్దని, బెల్స్ 150 కేజీలకి మించి ఉండరాదు, ఉదయం 4:30 నిమిషాలకు కాటాలు ప్రారంభించడం జరుగుతుంది కావున బెల్స్ అన్ని లోపల వేయాలి, బేల్స్ తీసుకొచ్చే ట్రాక్టర్ ను డ్రైవర్లు క్రమబద్ధకంగా ఉంచాలని, బెల్లు కాటాలు వేసే సమయంలో దగ్గర ఉండి చూసుకోవాలని, టీబీజీఆర్ నంబర్లు దగ్గరుండి రాయించుకోవాలని, ఫుల్ బ్యారన్ ఉన్న వాళ్లు 4 బేల్స్, 0.75 బ్యారన్ ఉన్న రైతులు 3 బెల్స్ 0.50. బ్యారన్ ఉన్న రైతులు 2 బెల్స్ 0.25, బ్యారన్ ఉన్న రైతులు 1 బెల్ తీసుకురావాలని ఆయన తెలిపారు.

# డ్వాక్రా గ్రూపులు రుణాలను సక్రమంగా చెల్లింపులు చేయాలి



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 3)

బ్యాంకుల నుంచి గ్రామీణాభివృద్ధిశాఖ నుంచి రుణాలు తీసుకున్న స్వయం సహాయక సంఘాలు సభ్యులు సక్రమమైన చెల్లింపులు చేయాలని డిఆర్డిఏ వెలుగు ఏపిఎం బి గోపీనాథ్, ఏపీజీబీ కొండేపి మేనేజర్ లాలం శ్రీనివాస్, ఎస్‌బీఐ మేనేజర్ శరత్ ఉమ్మడిగా ఒక ప్రకటనలో తెలిపారు. కొండేపి ఏపీజీబీ, ఎస్‌బిఐ బ్యాంకులలో బ్యాంకు మేనేజర్లు, బ్యాంక్ స్టాఫ్, వెలుగు స్టాఫ్‌తో సిఆర్ఎం సమావేశం నిర్వహించారు. మండలంలో ఉన్న స్వయం సహాయక సంఘాల్లో ఉన్నటువంటి స్వయం సహాయక సంఘాలకు సంబంధిత సర్వీస్ ఏరియాలోని బ్యాంకుల నుంచి, డిఆర్‌డిఏ వెలుగు శాఖ నుంచి, సభ్యుల జీవనోపాధి ఏర్పాటు నిమిత్తం విరివిగా రుణాలు అందించడం జరుగుతుందని తెలిపారు. తీసుకున్న రుణాలను తప్పనిసరిగా జీవనోపాధి ఏర్పాటు చేసుకొని ఆదాయం అభివృద్ధి పెంపొందించుకొని అంతే నిబద్ధతతో రుణాలు రికవరీలు చేయాలని తెలిపారు. అదేవిధంగా స్వయం సహాయకంగా సభ్యుల పొదుపు ఖాతాలో ప్రతినెల సక్రమంగా చేసుకుంటున్న పొదుపును సమముగా పంపిణీ చేయకుండా పదిమందిలో అవసరమైన సభ్యులకు అంతర్గత రుణాలు కొరకు మొదటి ప్రాధాన్యతగా అందించుకోవాలని తెలిపారు. అదేవిధంగా ప్రతి ఒక్క గ్రూపు సభ్యులు నగదు రహిత లావాదేవీలను మాత్రమే అనుసరించాననీ పిలుపునిచ్చారు. దీని ద్వారా సభ్యుల మధ్య అపోహలకు అవకతవకలకు తావు లేకుండా పారదర్శకత ఉంటుందని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అందిస్తున్న సబ్సిడీ రుణాలైనా పీఎం ఈజిపి , పిఎం ఎఫ్ఎంఈ రుణాల పట్ల కూడా అవగాహన కల్పించుకొని యూనిట్లను ఏర్పాటు చేసుకొని సబ్సిడీ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. గ్రామీణాభివృద్ధి శాఖ సర్ప్ సీఈఓ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు నూతన ఆర్థిక సంవత్సరమైన 2025 -26 సంవత్సరంలో సభ్యుల ఆర్థిక జీవనోపాధి ప్రణాళికలను తయారుచేసి ప్రభుత్వం రుణాలు, బ్యాంకుల రుణాలు ను సమన్వయం చేసుకుంటూ సభ్యుల జీవనోపాధికి తోడ్పాటు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్డిఏ వెలుగు సీసీలు వి కృష్ణారెడ్డి, డి మల్లికార్జున, కే రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థికాభివృద్ధికి అండగా కుట్టు శిక్షణ

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 3)

వెంకటాచలంలోని మహిళా ప్రాంగణంలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కుట్టుశిక్షణ కార్యక్రమాన్ని గురువారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు కుట్టు శిక్షణ అనంతరం, రూ.6 వేలతోపాటుస్టైఫండ్‌తో పాటు ఉచితంగా మిషన్ ను అందించనున్నారు. కుట్టు శిక్షణ కార్యక్రమానికి సంబంధించిన సౌకర్యాల కల్పనకు రూ.5.91 లక్షలు కేటాయించారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి అని ఆయన అన్నారు.







# ఉచిత ఎంసెట్ కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించిన ఎంపీడీవో శ్రీనివాసులు

(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, ఏప్రిల్ 3)

విజయ్ సోషల్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉత్తమ ర్యాంకులు సాధించాలని యర్రగొండపాలెం ఎంపీడీఓ బి శ్రీనివాసులు సూచించారు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విజయ్ సోషల్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత ఎంసెట్ కోచింగ్ సెంటర్ పి ఆంజనేయులు, డిప్యూటీ తహసీల్దార్ యన్ మల్లికార్జున నాయుడు అందరు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల అధికారులు మాట్లాడుతూ ఈ ఉచిత కోచింగ్‌ని అందిపుచుకొని విద్యార్థులు తమ లక్ష్యాన్ని చేరుకోవాలి అని ఆకాంక్షిస్తూ విద్యార్థులు ఉపయోగించుకోవాలని, స్వచ్ఛంద సంస్థలు నూతన సమాజానికి వారధులనీ ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పభుత్వ జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సోషల్ వర్కర్ పూర్ణకంటి తిరుమలయ్య, వికలాంగుల హక్కుల పోరాట సమితి ప్రకాశం జిల్లా అధ్యక్షుడు గుమ్మా రాజయ్య, ట్రస్ట్ చైర్మన్ సండ్రపాటి విజయ్ కుమార్, ట్రస్ట్ మెంబెర్ సండ్రపాటి నిరీక్షణ, టీచింగ్,నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు.





# ప్రశాంతంగా సామాజిక ప్రజా తనిఖీ వేదిక కార్యక్రమం





(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, ఏప్రిల్ 3)

మార్కాపురం మండలం మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన సామాజిక ప్రజా తనిఖీ వేదిక కార్యక్రమం ఎంపీడీవో శ్రీనివాసులు అధ్యక్షతన 16వ సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలం పరిధిలో ఉన్న పంచాయతీలకు సంబంధించిన తనికి నివేదిక సభ్యులు జిల్లా అధికారుల దృష్టికి వారు గుర్తించిన చిన్న చిన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. సామాజిక ప్రజా తనిఖీ బృందం మండల పరిధిలో మస్టర్లలో ఒకటి, రెండు, సంతకాలు లేకపోవడం, కొలతల్లో చిన్న చిన్న వ్యత్యాసాలు ఉండడం, అలాగే వాలంటీర్లు పనికి వెళ్లినట్లు గుర్తించి అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడంతో వాటిపై ఏపీఓ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు అధికారులకు వివరణ ఇవ్వడం జరిగిందని, అలాగే వర్ష ధారణ లేకపోవడం వలన మొక్కలు ఎండి పోయినట్లు రైతులు సూచిస్తున్నారు. వాటిని హార్టికల్చర్ వారి రిపోర్ట్ ద్వారా పరిష్క రించడానికి ప్రయత్నం చేస్తున్నామని, ఈ సందర్భంగా చిన్నచిన్న సమస్యలు తప్ప ప్రశాంతంగా సామాజిక ప్రజా తనిఖీ వేదిక కార్యక్రమం కొనసాగిందని పిడి జోసఫ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.వందర్ మ్యాన్, డిస్టిక్ విజిలెన్స్ ఆఫీసర్ ఎంపీడీవో శ్రీనివాసులు, మూర్తి, స్టేట్ రిసోర్సెస్ పర్సన్, ఆర్టికల్చర్ అధికారి రమేష్, ఏపీవో జీవరత్నం, టెక్నికల్ అసిస్టెంట్లు, ప్రజా తనీకి వేదిక అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పాల్గొన్నారు.

## తేళ్ళ అరుణ, డాక్టర్ నూనె అంకమ్మరావులకు సత్కారం





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 3)**

స్థానిక ఒంగోలులోని సమతానగర్ నందు గల గాయత్రి గ్రామర్ స్కూల్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఉగాది పురస్కారాలను అందుకున్న నరసం (నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం) గౌరవాధ్యక్షురాలు తేళ్ళ అరుణ, కళామిత్ర మండలి (తెలుగు లోగిలి) సంస్థ జాతీయ అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావులను ఘనంగా సత్కరించారు. ఈ సన్మాన కార్యక్రమాన్ని స్కూల్ నిర్వాహకులు రామలక్ష్మి, నారాయణ పబ్లిక్ స్కూల్ నిర్వాహకులు కొల్లా సౌజన్య సమక్షంలో ఏర్పాటు చేశారు. ఈ సత్కార నిర్వహణ కొల్లా నారాయణ పర్యవేక్షణలో జరిగింది. ఈ సందర్భంగా వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## కస్తూరిభా స్కూల్లో ఎమ్మెల్యే తనిఖీలు





**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, ఏప్రిల్ 3)**

వెల్దుర్తి మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలకు సంబంధించిన వంటశాలలో ఉన్న సరుకులు,కూరగాయలను పరిశీలించారు. అలానే తరగతి గదులను సందర్శించారు. వసతి, అందిస్తున్న ఆహార నాణ్యత, అందుతున్న విద్యాబోధన వంటి విషయాలను నేరుగా విద్యార్థినిలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థినిలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అలానే పాఠశాలలో చేయవల్సిన కొన్ని మార్పులను గుర్తించి, మళ్లీ వచ్చేసరికి చెప్పిన మార్పులు సరిచేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గంగా భవాని బాయ్ కు ఎమ్మెల్యే సూచించారు. పాఠశాలలో ఇంకా ఏమైనా మౌళిక వసతులు, సౌకర్యాలు వంటివి ఏ అవసరం ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా పాఠశాలలో అదనపు తరగతి గదులు అవసరమని గంగా భవాని బాయ్ ఎమ్మెల్యే జూలకంటికి వినతి పత్రం అందించారు. సాధ్యమైనంత త్వరగా నిధులు కేటాయించి, నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెల్దుర్తి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 46వ రోజు గడపగడపకు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి





**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 3)**

నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలో 46వ రోజు గడపగడపకు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి కార్యక్రమం 1వ డివిజన్, నారాయణరెడ్డి పేట నుంచి ప్రారంభమైంది. ప్రతి ఇంటిలో హారతి ఇచ్చి, నుదుట తిలకం దిద్దారు మహిళలు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు, ప్రజా సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నారు టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి. ప్రతి ఇంటికి వెళ్లి స్థానిక ప్రజలను పలకరించి సమస్యలను తెలుసుకుంటున్నారు టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి. క్షేత్రస్థాయిలో పర్యటిస్తే ప్రజల వాస్తవిక సమస్యలు తెలుస్తాయని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి స్ఫూర్తితో గడపగడపకు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించానని టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. ముచ్చటగా మూడోసారి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి భారీ మెజార్టీ ఇచ్చిన రూరల్ ప్రజలకు రుణపడి ఉంటామని టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు.

# శాంతిభద్రతల పరిరక్షణ, మహిళా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి

### ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్

**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, ఏప్రిల్ 3)**

కనిగిరి సబ్ డివిజన్‌లోని కనిగిరి సర్కిల్ కార్యాలయం, పోలీసు స్టేషన్లను ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్ తనిఖీ చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ, మహిళా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నేరాల కట్టడి, రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. టెక్నాలజీపై అవగాహన పెంచుకుంటూ వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ పోలీస్ శాఖపై మరింత నమ్మకం పెంపొందించేలా ఉత్తమ సేవలు అందించాలన్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా కనిగిరి డీఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ జిల్లా ఎస్పీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ పరిసరాలు, పోలీస్ క్వార్టర్స్,పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ,ఎస్టీ పోక్సో కేసులు, ఎస్డీపీవో ప్రత్యేక కేసులకు సంబంధించి ధర్యాప్తుకు డిఎస్పీకి పలు సూచనలు చేశారు. ప్రజా ఫిర్యాదుల పిటీషన్లు, డిసిర్బి, డిపిఓకు సంబంధించిన రిప్లయ్స్‌ను త్వరితగతిన పంపించాలని ఆదేశించారు. సబ్ డివిజన్ పరిధిలో నెలకొన్న పరిస్థితులు మరియు శాంతి భద్రతల అంశాలపై కనిగిరి డీఎస్పీతో క్షుణ్ణంగా చర్చించారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణలో కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ ఆదేశించారు. సబ్ డివిజన్ ఆఫీసులో పనిచేస్తున్న సిబ్బంది ఏఏ విధులు నిర్వర్తిస్తున్నారో ఆరా తీశారు. విధి నిర్వహణలో వారు ఏవైనా సమస్యలు ఎదుర్కొంటున్నా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఎస్పీ తెలిపారు. కనిగిరి సర్కిల్ కార్యాలయం, కనిగిరి, హనుమంతునిపాడు పోలీస్ స్టేషన్‌లను జిల్లా ఎస్పీ సందర్శించారు. పోలీస్ స్టేషన్ల యొక్క పరిసర ప్రాంతాలను, పోలీస్ స్టేషన్‌ల నిర్వహిస్తున్న విధానాన్ని పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించి, నమోదైన కేసులను త్వరితగతిన పరిష్కారం అయ్యేలా చూడాలని, కేసుల పరిష్కారంలో జాప్యం వహించే కొలది బాధితులకు సత్వర న్యాయం అందించలేమని దానికి అనుగుణంగా పోలీస్ స్టేషన్‌ల





యొక్క నిర్వహణ ఉండాలని జిల్లా ఎస్పీ సూచించారు. పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అందరితో మాట్లాడుతూ అందరి యొక్క ఆరోగ్య పరిస్థితులను గూర్చి ఆరా తీశారు. వృత్తిపరంగా, ఆరోగ్యవరంగా, కుటుంబ వరంగా ఏమైనా సమస్యలు ఎదుర్కొంటున్నది, మొదలైన విషయాలను వారితో ముఖాముఖి మాట్లాడారు. సిబ్బంది సంక్షేమానికి ఎల్లవేళలా కృషి చేస్తామన్నారు. క్రికెట్ బెట్టింగ్, శక్తి యాప్, మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, సీసీ కెమెరాల యొక్క ప్రాముఖ్యత గురించి ప్రజలకు తెలియచేసి సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. పోలీసుల పట్ల ప్రజలకు నమ్మకం కలిగించే విధంగా పనిచేయాలని, ఫిర్యాదులపై వేగంగా స్పందించాలని, ముఖ్యంగా పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని, నేరాల నియంత్రణలో నిరంతరం అప్రమత్తంగా వుండాలన్నారు. కనిగిరిలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జెడ్పీహైస్కూల్ విద్యార్థులతో జిల్లా ఎస్పీ కొద్దిసేపు ముచ్చటించారు. విద్యార్థులు క్రమశిక్షణగా మెలిగి, బాగా చదువుకోవాలని, వారి కుటుంబసభ్యులు బైక్ మీద వెళ్లేటప్పుడు రహదారి భద్రత నియమాలు పాటిస్తూ తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకొని వెళ్ళమని చెప్పాలని జిల్లా ఎస్పీ సూచించారు. జిల్లా ఎస్పీ మహిళా పోలీస్‌లతో మాట్లాడుతూ వారి పరిధిలో ఉన్న ప్రజలతో నిత్యం మమేకం అవుతూ, వారి సమస్యలు తెలుసుకుంటూ వాటి పరిష్కరణలో తమ వంతు పాత్ర పోషించాలని పేర్కొన్నారు. సైబర్ నేరాలు, గుడ్ టచ్ బ్యాట్ టచ్, రోడ్డు భద్రత నియమాలు, క్రికెట్ బెట్టింగ్, శక్తి యాప్ మరియు మాదక ద్రవ్యాల పై ప్రజలకు మరియు విద్యార్థులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. కనిగిరి లోని శ్రీ షిరిడి సాయిబాబా, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానము జిల్లా ఎస్పీ ముందుగా సందర్శించి ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. నూతనంగా నిర్మిస్తున హనుమంతునిపాడు పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ సందర్శించి, ఇప్పటివరకు పూర్తయినా పనులను పరిశీలించి మిగిలిన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. పోలీస్ స్టేషన్ నిర్మాణానికి సంబంధించిన ప్లానింగ్ ను పరిశీలించి, పోలీస్ స్టేషన్ యొక్క నమూనాలో అవసరం మేరకు చేయవలసిన మార్పులను గురించి ఎస్పీ గారు తెలియజేశారు. కనిగిరిలో అంజుమన్ కమిటీ సభ్యులు, గ్రానైట్ క్వారీ సభ్యులు కనిగిరిలో నేరాల నియంత్రణకు సిసి కెమెరాలు, డ్రోన్ కెమెరాను అందచేశారు. జిల్లా ఎస్పీ వెంట కనిగిరి డిఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, ఎస్ బి ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, కనిగిరి సీఐ ఖాజావలి, కనిగిరి ఎస్ఐ శ్రీరామ్, హెచ్‌ఎం పాడు ఎస్ఐ మాధవరావు, సిబ్బంది ఉన్నారు.





# ఐదేళ్ల తర్వాత మళ్లీ ట్రాక్‌లోకి సంక్షేమ పథకాలు

### వైసీపీ పాలనలో మూలన పెట్టేసిన కార్యక్రమాలకు బూజు దులుపుతున్న టీడీపీ కూటమి

### వెంకటాచలంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన మత్స్యకారులకు సైకిళ్లు, వలల పంపిణీ

### సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 3)**

టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరిగి సంక్షేమ ఫలాల పంపిణీ పున:ప్రారంభమైందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. 2019-20 ఆర్థిక సంవత్సరంలో గిరిజన బిడ్డలకు మంజూరైన ఈ యూనిట్ల పంపిణీని వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లూ పక్కనపెట్టేసిందన్నారు. 42 మంది గిరిజనులకు సైకిళ్లు, చేపల వలలు పంపిణీ చేశామన్నారు. ఒక్కో యూనిట్ విలువ రూ.10 వేలు కాగా, లబ్ధిదారుడి వాటా రూ.1000 మాత్రమేనన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల కోసం జిల్లాలో 38 భవిత కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఈ కేంద్రాల్లో 734 మంది చిన్నారులు ఉండగా, వారికి 72 మంది సేవ చేస్తున్నారు. భవిత కేంద్రాల్లో చిన్నారులకు సేవలు అందించడంలో ఆయాలు చేస్తున్న కృషి అభినందనీయమైనదన్నారు. ఆ చిన్నారుల్లో అవసరమైన వారికి ఈరోజు వినికిడి యంత్రాలు, ట్రై సైకిళ్లు పంపిణీ చేశాం. స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు కూడా తిరిగి ప్రారంభమయ్యాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో గిరిజనుల సంక్షేమాన్ని కూడా అప్పటి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసేసిందన్నారు. బటన్ నొక్కుడు తప్ప మిగిలిన కార్యక్రమాలన్నింటిని జగన్ రెడ్డి గాలికొదిలేశారు. బీసీ రెసిడెన్షియల్ స్కూలు కోసం స్థలాన్ని మంజూరు చేయడంతో పాటు భవనాల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు.









## ఢిల్లీలో పలు అంశాలపై సమీక్ష నిర్వహించిన ఎంపీ మాగుంట



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 3)**

ఢిల్లోలోని పార్లమెంట్ భవనంలో కమిటీ హాల్లో గృహ, పట్టణ వ్యవహారాల కమిటీ సమావేశంలో భాగంగా 1. ప్రాంతీయ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టం, నేషనల్ కాపిటల్ రీజన్ ట్రాన్స్పోర్ట్ కార్పొరేషన్ యొక్క పాత్ర' అనే అంశంపై గృహ నిర్మాణం,



పట్టణ వ్యవహారాల స్టాండింగ్ కమిటీ (2024-25) ముసాయిదా నివేదిక పరిశీలనకు ఆమోదం, 'అటల్ మిషన్ ఫర్ రిజువనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్ఫర్మేషన్‌పై గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధుల వివరణ. పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు గృహ, పట్టణ వ్యవహారాల కమిటీ చైర్మన్, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, కమిటీ సభ్యులు, పలు శాఖల అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# అభివృద్ధి చేసి చూపించేది కూటమి ప్రభుత్వం

పట్టణాన్ని అత్యంత సుందరమైన నగరంగా తీర్చిదిద్దుతాం
పట్టణ అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి
పురపాలకసంఘ అనుమతుల మేరకు వాణిజ్య, గృహ నిర్మాణాలు చేపట్టాలి
ప్రతి వార్డులో మౌలిక వసతులు కల్పన, పట్టణ సమగ్ర అభివృద్ధి నా లక్ష్యం
ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఏప్రిల్ 3)

అభివృద్ధి చేసి చూపించేది కూటమి ప్రభుత్వమని, మాటలు చెప్పేది వైసీపీ ప్రభుత్వమని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా వ్యవహరించిన జగన్మోహన్‌రెడ్డి రామాయపట్నం పోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో కందుకూరు మున్సిపాలిటీ అభివృద్ధికి 26 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తున్నామని చెప్పి అరకొర నిధులిచ్చి ప్రజలను మోసం చేశారని ఎమ్మెల్యే విమర్శించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఫిబ్రవరి 15 తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం సందర్భంగా కందుకూరు పట్టణానికి విచ్చేసినప్పుడు మున్సిపాలిటీకి 50 కోట్ల రూపాయల నిధులు కేటాయించడం జరిగిందని తెలియజేశారు. పట్టణ అభివృద్ధికి ముందుగా 26 కోట్ల రూపాయలు నిధులకు ప్రణాళికలు అంచనాలు తయారు చేయాలన్నారు.. దానిలో భాగంగా అన్ని వార్డుల్లో మౌలిక వసతులు కల్పనలో భాగంగా 25 కిలోమీటర్ల మేర రోడ్లు 14 కిలోమీటర్ల మేర డ్రైన్‌లకు నిధులు అవసరమవుతాయని పురపాలక శాఖ మంత్రి పి నారాయణ, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నుడా విసి సూర్యతేజ, మున్సిపల్ అధికారులతో జరిగిన సమీక్ష




సమావేశంలో చర్చించామన్నారు. పట్టణ ప్రజలు అందరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న వాణిజ్య సముదాయాలు, గృహాల యజమానులు మున్సిపాలిటీ నిబంధనల మేరకే నిర్మాణాలు చేయాలని, అలా కాకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే సూచించడం జరిగింది. ఎవరైనా మున్సిపాలిటీ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టి తన పేరు కానీ, పార్టీ పేరు కానీ వాడుకొని వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అమృత్ 2.0 పథకంకు కందుకూరు మున్సిపాలిటీ ఎంపికైందని, దానిలో భాగంగా త్వరలో 49 కోట్ల రూపాయల నిధులు కేటాయించబడతాయని, ఆ నిధులతో పట్టణంలో మౌలిక వసతులు కల్పనకు, కుంటల సుందరీకరణ, ప్రతి ఇంటికి తాగునీరు అందించేందుకు వినియోగిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించిన ఎం.ఆర్.ఎఫ్ మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ ప్లాంట్ లో అత్యధిక టెక్నాలజీ ద్వారా రోజుకు 30 టన్నుల చెత్తను ప్రాసెసింగ్ చేసే మిషన్ ను త్వరలో ఏర్పాటు చేసి ఏ రోజు చెత్తను ఆరోజు ప్రాసెసింగ్ చేసే విధంగా ప్రణాళికలు రూపొందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు నార్నె రోశయ్య,గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు నాగరాజు, పట్టణ మాజీ టిడిపి అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, కంద్రా మాల్యాద్రి, ఉప్పుటూరి శ్రీనివాసరావు, ఉన్నం వీరాస్వామి, పార్టీ నాయకులు చిలకపాటి మధుబాబు, బెజవాడ ప్రసాద్, గోచిపాతల మోషే, రెబ్బవరపు మాల్యాద్రి, షేక్ సలాం, తదితరులు పాల్గొన్నారు.

## కనపడకుండా పోయిన అర్జున్‌రెడ్డి మృతదేహం గుర్తింపు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 3)



పాతపాడు గ్రామంలో గత నెల 19వ తేదీ నుంచి కనపడకుండా పోయిన అర్జున్ రెడ్డి మృతదేహాన్ని గుర్తించారు పోలీసులు. గురువారం ఉదయం రమేష్ రెడ్డిని అరెస్ట్ చేయగా రమేష్‌రెడ్డి అర్జున్‌రెడ్డిని ఏ విధంగా చంపాడో తెలిపారు. దీనిలో భాగంగా 19వ తేదీ అర్జున్ రెడ్డిని మద్యం తాగడానికి అని ముస్లిం మన్యం పొలాల వైపు తీసుకుని





వెళ్లి, అక్కడ ఫుల్లుగా మద్యం తాగించి రాయితో ఘనతపై కొట్టి హత్య చేయడం జరిగింది. ఆ తర్వాత అర్జున్‌రెడ్డి భార్య సాయంతో అర్జున్‌రెడ్డి మృతదేహాన్ని పక్కనే ఉన్న వరల బావిలో పడేశారు. దీనిపై కేసును మర్డర్ కేసుగా మార్చి పంచ నామ నిర్వహించి మృతుడు అర్జున్ రెడ్డి డెడ్ బాడీని వారి బంధువులకు అప్పగించడం జరిగింది. హత్య చేయడానికి ప్రోత్సహించిన, సహకరించి సాక్షాలను తారుమారు చేసిన అర్జున్ రెడ్డి భార్య సుశీలను కోసం టీంలను ఏర్పాటు చేశారు. త్వరలోనే ఆమెను కూడా పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

## ప్రపంచ వేదిక అగ్రస్థానంలో ఇతాక ఇంటర్నేషనల్ స్కూల్



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 3)

ప్రపంచ వేదిక అగ్రస్థానంలో ఇ తాక ఇంటర్నేషనల్ స్కూలు గుర్తింపు ఉందని ఆ స్కూల్ యాజమాన్యం తెలిపారు. వరుసగా మూడవ సంవత్సరం 30 దేశాల నుండి 29 వేల విద్యార్థులతో పోటీపడి ఎన్ఎస్ఎస్లో నిలవడం గొప్ప విశేషమైన అన్నారు. ఈ సందర్భంగా గురువారం స్కూల్ యాజమాన్యం స్కూల్ కాంప్లెక్స్‌లో విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి యాజమాన్యం మాట్లాడుతూ ఎంతో ప్రతిభవంతులైన ఆ సంస్థలో చదివిన విద్యార్థులు రాబోయే రోజుల్లో విద్యార్థులు కూడా మంచి ఫలితాలు సాధిస్తారని సమస్త నిర్వాహకులు తెలిపారు. ఈ సమస్త నిరంతరం విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తూనే ఉంటుందని వారు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపకులకు, విద్యార్థిలకు పాఠశాల యాజమాన్యం సీఎం జీవన్, అకాడమిక్ డైరెక్టర్ రాణి, ప్రిన్సిపాల్ శోభన, విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

# రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 3)

ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు ఎన్టీఆర్ జిల్లా గుడివాడలో జరగబోయే రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ప్రకాశం జిల్లా ఒంగోలులోని భారత జాతీయ వ్యాయామ కళాశాలలో డిస్టిక్ సెలక్షన్స్ జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఎస్డీఓ రాజరాజేశ్వరి, ప్రకాశం జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు, ప్రకాశం జిల్లా అసోసియేషన్ కార్యదర్శి గుంటి భక్త ధృవుడు, ప్రకాశంజిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్



అధ్యక్షులు రమేష్, ప్రకాశంజిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఉపాధ్యధ్యక్షులు గుంటి పవన్ కుమార్, జాయింట్ సెక్రెటరీ మల్లికార్జునరావు, రాఘవరావు, క్రైమ్ బ్రాంచ్ సాయి, అనిల్, పీఈటి అశోక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉప రవాణాశాఖ కమీషనర్ సుశీల స్పాన్సర్ చేసిన ఫ్రీ కాస్ట్యూమ్స్‌ని డీఎస్డీవో ఆవిష్కరించడం జరిగింది. జిల్లావ్యాప్తంగా ఈ కార్యక్రమానికి సుమారు నూట యాభై మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ముఖ్య అతిథులు అభినందించారు. రాష్ట్రస్థాయిలో కూడా ప్రకాశం జిల్లాకు ఎన్నో పతకాలు తీసుకుని రావాలని క్రీడాకారులను అభినందించారని ప్రకాశం జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి భక్తధృవుడు తెలిపారు.





## 6న ఘనంగా బిజేపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించాలి



(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 3)

ఈ నెల 6వ తేదీన బిజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి తెలిపారు. గురువారం పొదిలి పట్టణం బెల్లంకొండ నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఆదేశాల మేరకు ఏప్రిల్ 6వ తేదీన బిజెపి ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరగాలని నాయకులు, కార్యకర్తలకు వివరించారు. అనంతరం పార్టీ బలోపేతం కోసం కొన్ని ముఖ్య విలువైన సూచనలను తెలిపారు. కార్యకర్తలు, నాయకుల నుంచి అవసరమైన సమాచారాలను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బిజెపి పార్టీ సిద్ధాంతాలు భావాలు నచ్చి తమ ఇష్టంతో పార్టీలో చేరిన నూతన యువకుడు షేక్ మహమ్మద్‌కు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆమె సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దోర్నాల రమణారెడ్డి, టౌన్ అధ్యక్షుడు యుద్ధం మహేష్, సూరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పువ్వాడ నారాయణ, కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, మాకినేని ప్రతాప సింహాపువ్వాడ నారాయణ, వెంకట్, ప్రధాన కార్యదర్శి ఖదర్ భాష, షేక్ రఫీ, బాషా. అంజి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు ఆర్టీసీని మరింత చేరువ చేస్తున్న కూటమి ప్రభుత్వం

### వినుకొండలో కొత్త ఆర్టీసీ బస్సులను ప్రారంభించిన చీఫ్ విప్ జీవీ

(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఏప్రిల్ 3)



కూటమి ప్రభుత్వం వచ్చింది మొదలు రాష్ట్రంలో ఆర్టీసీని ప్రజలకు మరింత చేరువ చేస్తూ వస్తున్నామని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. విద్యుత్ వాహనాల వైపు సంస్థను నడిపించడం ద్వారా భవిష్యత్‌లో ప్రజలపై ఛార్జీల భారం, కాలుష్యం సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. వినుకొండ ఆర్టీసీ డిపో పరిధిలో 2కొత్త బస్సులను గురువారం ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు జెండా ఊపి ప్రారంభించారు. బస్టాండ్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో వినుకొండ-విజయవాడ ఎక్స్ ప్రెస్ సర్వీసులు ప్రజలకు అందుబాటులోకి తీసుకుని వచ్చారు.. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విశాల దృక్పథంతో గ్రామీణ ప్రాంతాలకు కూడా ఆర్టీసీ సేవలను విస్తరిస్తున్నారని ఆయన అన్నారు. గతంలో ఇదే వినుకొండ డిపోలో 20కి పైగా డీలక్స్, లగ్జరీ, సూపర్ లగ్జరీ, ఇంద్రా బస్సులు ప్రవేశపెట్టాని, కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా 1489 కొత్త బస్సులు ప్రారంభమైనట్లు తెలిపారు. త్వరలో మరో 1400 బస్సులు రానున్నాయన్నారు. ఈ సందర్భంగానే ఆర్టీసీపై జగన్ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపారు చీఫ్ విప్ జీవీ. వాళ్లు 4సార్లు పెంచి ప్రజలపై భారం మోపినా, సామాన్యులకు ఎలాంటి సౌకర్యం కల్పించలేదని, కార్మికుల్ని ఆదుకోలేదు, డిపోలను మెరుగుపరచలేదన్నారు. పైగా ఆస్తులను అమ్మేందుకు సిద్ధమయ్యారని, ప్రజలు ఓడించకపోయి ఉంటే మొత్తం తాకట్టుల్లో పెట్టేసేవారన్నారు. ఎన్డీయే ప్రభుత్వంలో పల్లె వెలుగు బస్సులు పెంచడం, విద్యార్థులకు సమయానుగుణ సర్వీసులు అందించడం, డీజిల్ ఖర్చు తగ్గించేందుకు విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టడం వంటి చర్యలు చేపట్టిందని ఆయన వివరించారు. వినుకొండలో కొత్త డిపో నిర్మాణానికి రూ.17 కోట్లు అవసరమని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఆర్టీసీ ఎండీ సమక్షంలో అందుకు సంబంధించిన ప్రాజెక్ట్ రిపోర్ట్ సిద్ధం సిద్ధమవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, ఆర్ఎం మధు, డీఎం నాగేశ్వరరావు, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.








## పురిటిగడ్డ రుణం తీర్చుకోవాలి ప్రాంతాల అభివృద్ధికి నేను సైతం

ఎమ్మెల్యే జూలకంటి



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, ఏప్రిల్ 3)

ప్రతిఒక్కరూ పురిటిగడ్డ రుణం తీర్చుకోవాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సూచించారు. గురువారం దుర్గి మండలం, కోలగుట్ల గ్రామంలో దాదాపు కోటి రూపాయలతో నూతనంగా నిర్మించిన యండ్లపల్లి చంద్రమౌళి అరుంధతి కమ్యూనిటీ హాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వీకులు గ్రామ కరణాలుగా, ప్రజాప్రతినిధులుగా పనిచేసిన పెద్దరికాన్ని మరవకుండా స్వగ్రామానికి ఏదో ఒకటి చేయాలని వారి పిల్లలు ఆలోచించి, రుణం తీర్చుకోవడం ఆదర్శనీయమన్నారు. గ్రామాభివృద్ధిలో భాగస్వాములుగా మారిన యండ్లపల్లి కుటుంబాన్ని ఈ సందర్భంగా ఆయన అభినందించి, సన్మానించారు. అలానే కమ్యూనిటీ హాలు పక్కనే నూతనంగా నిర్మిస్తున్న శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయానికి టీటీడీ వారితో మాట్లాడి తనవంతు సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యండ్లపల్లి వారి కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, దుర్గి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫోన్లు తిరిగిచ్చిన అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 3)

ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం జిల్లాలో ఉన్న అన్ని ప్రాజెక్టుల నాయకత్వం సెక్టార్ లీడర్స్ జిల్లాలోని ఐసిడిఎస్ పిడి ఆఫీసులో మూడేళ్ల క్రితం ఇచ్చిన ఫోన్లు పనిచేయని కారణంగా తిరిగి ఇచ్చారు. ప్రభుత్వం బి ఎస్ 20 వర్షన్ యాప్‌ను నిన్న విడుదల చేసింది. ఆ యాప్‌లో అంగన్వాడీల యొక్క వర్కర్స్ హెల్పర్స్ ఒక పేస్ రికగ్నైజేషన్ చేయాలి. ఉదయం 9 గంటలకు సాయంత్రం నాలుగు గంటలకు చేయాలి. 11 రకాల రిజిస్టర్ రిపోర్ట్స్ ఆ యాప్ లో రాయాలి. ఉదయం 9 గంటలకి ఎంతమంది పిల్లలు ఉంటే అంత మందికే ఫుడ్డు తీయాలి. అనేక రకాల సమస్యలు ఉన్నాయి. ప్రకాశం జిల్లాలో ఏడు ప్రాజెక్టులు గిరిజన ప్రాంతాల్లో ఉన్నాయి. అటవీ ప్రాంతంలో ఉన్నాయి. వీళ్ళందరికీ సిగ్నల్స్ ఉండవు, సిగ్నల్స్ లేకపోతే ఫేస్ రికగ్నైజేషన్ కాదు హాజరు కానీ విధంగా చూపించి అంగన్వాడీలకి జీతం కట్ చేసే పరిస్థితి. అందువలన అంగన్వాడీలు పనిచేయడానికి వ్యతిరేకం కాదు, 5జీ ట్యాబులు ఇస్తే పని చేస్తాం, పనిచేయని ఫోన్లను వెనక్కి ఇచ్చేసామన్నారు. కమిషనర్ సొంత ఫోన్లలో పని చేయవద్దు అని చెప్పారు. జిల్లాలో అనేకమంది అంగన్వాడీలు 80 నుంచి 90 శాతం అంగన్వాడీలు సొంత ఫోన్లలో పని చేస్తా ఉన్నారు. అయితే ఈ ఫోన్లు ఆఫీస్ ఫోన్‌లో మా దగ్గర ఉంటే అధికారులు మాకు సంబంధం లేదు సొంత ఫోన్లోనైనా పని చేయండి అని చెప్పి బెదిరిస్తున్నారు. అందువలన ఆఫీస్ ఫోన్లు ఆఫీస్ కి ఇచ్చాం ఈ ఫోన్లో అసలు పని చేస్తాయా ఇంతవరకు ఈ ఫోన్లలో సాధ్యమేనా ఎవరైనా నిపుణులతో ప్రభుత్వం పరిశీలిం చేయాలి. అంగన్వాడీలకి ఇబ్బందులకు గురి చేయొద్దు పనిచేసే ఫైర్ టేబుల్ ఇవ్వాలి. అంగన్వాడీలకు కనీస వేతనం ఇవ్వాలి. ప్రభుత్వ ఉద్యోగులు మాదిరిగా చెక్కిం చెక్కవుట్టు పెట్టినప్పుడు ప్రభుత్వ ఉద్యోగులు మాదిరిగా కనీస వేతనాలు ఇవ్వాలి. అంగన్వాడీలపై పనిభారం తగ్గించి ప్రీస్కూల్ బలోపేతానికి ప్రభుత్వం కృషి చేయాలి అని ఈరోజు జిల్లాలో ఉన్నటువంటి అన్ని ప్రాజెక్టులు వాళ్ళు సెల్ ఫోన్స్ తిరిగి ఇచ్చారు. బ్యాలెన్స్ రెండు రోజుల్లో ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు సెక్టార్ నాయకత్వం పాల్గొన్నారు. ఎం ధనలక్ష్మి,ఎల్లమ్మ, శేషమ్మ, మధుర పోలమ్మ ,శోభ, మల్లేశ్వరి, రమాదేవి, ప్రభావతి, మహాలక్ష్మి, మున్నా, హెమిమా, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి, అంగన్వాడి సంఘం గౌరవాధ్యక్షులు ఎం రమేష్, సిఐటియు జిల్లా నాయకులు మాలకొండయ్య పాల్గొన్నారు.



## రీ సర్వేకు అనకర్లపూడి, చోడవరం గ్రామాలు ఎంపిక





(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, ఏప్రిల్ 3)

రీ సర్వే రెండవ దశలో భాగంగా కొండపి మండలంలోని అనకర్లపూడి, చోడవరం గ్రామాలు ఎంపికయ్యారు. రెండు గ్రామాల్లోనూ గ్రామసభలు, అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనకర్లపూడి గ్రామసభలో రీ సర్వేను ప్రారంభిస్తూ తహసీల్దార్ పి మురళి, గ్రామ నాయకులు వసంతరావు సభను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ కాశయ్య, మండల సర్వేయర్ రాజు, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వరరెడ్డి, రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, వీఆర్వో శ్రీనివాసులు, విఎస్ సుమంత్, గ్రామ రైతులు పాల్గొన్నారు. ఎటువంటి తప్పులకు ఆస్కారం లేకుండా రీ సర్వే నిర్వహించడం జరుగుతుందని, రైతులందరూ ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. అదేవిధంగా సాయంత్రం మూడు గంటల నుంచి చోడవరం గ్రామంలో గ్రామ సభ, ర్యాలీ నిర్వహించారు. ఇందులో గ్రామ నాయకులు బ్రహ్మయ్య, రాఘవులు బాలకృష్ణ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## రైతు సోదరులు పొగాకు గ్రేడింగ్ కచ్చితంగా చేయాలి

చైర్మన్ యశ్వంత్ కుమార్





(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 3)

ఒకటో పొగాకు వేలం కేంద్రంలో గురువారం భారత పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్, వైస్ చైర్మన్ బ్రహ్మయ్యతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు వేలం జరిగే విధానాన్ని పరిశీలించి బయ్యర్లు రైతులకు మంచి ధరలు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా రైతులను ఉద్దేశిస్తూ వారు ప్రస్తుత మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకుని వేలం లో వెళ్ళేవి మాత్రమే తీసుకు రావాలని కోరారు. వారు అంతర్జాతీయ స్థాయిలో ఉన్న పొగాకు ఉత్పత్తిని వివరించారు.పొగాకు బోర్డు ఎప్పుడూ రైతుల మంచి కోసమే పని చేస్తుందని తెలిపారు. వేలం కేంద్రాల కు వచ్చే ముందు ఒకసారి తమ పొగాకు బేళ్లను సరి చూసుకోవాలని, తేమ,వేడి, షాఫ్ట్ లేకుండా చూడాలని అన్నారు. రైతు సోదరులు కచ్చితంగా గ్రేడింగ్ చేయాలని కోరారు. గ్రేడింగ్ సరిగా చేయక పోతే మార్కెట్ జరపడం కష్టం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు,రైతులు బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

## అనాథ శవానికి అంతక్రియలు

### మానవత్వం చాటుకున్న మానవ సేవా సమితి

(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఏప్రిల్ 3)

ఓ అనాథ శవానికి అంతక్రియలు చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. మానవ సేవా సమితి సభ్యులు. వినుకొండ పట్టణం ప్రభుత్వ ఆసుపత్రిలో అనాథ శవానికి అంతక్రియలు చేసేందుకు సీనియర్ కౌన్సిలర్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత, మానవ సేవా సమితి అధ్యక్షులు పివి సురేష్‌బాబు ఆధ్వర్యంలో హెల్పింగ్ హార్డ్ సమస్త యువకులు ముందుకొచ్చారు. అనారోగ్యంతో ప్రభుత్వ ఆసుపత్రి నందు మరణించిన అనాథ శవానికి వారు అంతక్రియలు చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా పివి సురేష్ బాబు మాట్లాడుతూ కరోనా సమయంలో మానవ సేవాసమితి, హెల్పింగ్ హార్ట్ సమస్త సభ్యులు ఎంతోమంది అనాథ శవాలకు అంతక్రియలు జరిపి మానవత్వాన్ని చాటుకుందని అన్నారు. అనాథలకు అభాగ్యులకు సమస్త సభ్యులు అండగా నిలిచి చేతనైన సహాయ, సహకారాలు అందిస్తూ స్వచ్ఛంద సేవలు అందిస్తున్నారని తెలిపారు.

అనాథ శవం అంతక్రియలో సమస్త సభ్యులు పువ్వాడ కృష్ణ, షేక్. సర్కార్ నాగూర్, సయ్యద్ జాబీర్, వట్టికోటి ప్రసాద్, షేక్ యూసఫ్, తదితరులు పాల్గొన్నారు.





## కోటంరెడ్డి సోదరుల వెంటే నడుస్తా రాజకీయాల్లో తిరిగి కొనసాగుతా

### శ్రీధర్‌రెడ్డి, గిరిధర్ రెడ్డికి ప్రజల్లో ఉన్న ఆదరణ ఎనలేనిది

### తెలుగుదేశం పార్టీ నాయకులు బత్తల కృష్ణ



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 3)

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డికి ప్రజల్లో ఉన్న ఆదరణ ఎనలేదని వారి వెంటే తాను నడుస్తానని రాజకీయాల్లో తిరిగి కొనసాగాలని నిర్ణయించినట్లు తెలుగుదేశం పార్టీ నాయకులు బత్తల కృష్ణ తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం సాయంత్రం ఒక వీడియో విడుదల చేసారు. రెండు నెలల క్రితం తన ఆరోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందుల వల్ల రాజకీయాలనుంచి వైదొలగాలని నిర్ణయించానన్నారు. అయితే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పట్ల తనకున్న అభిమానంతో పాటు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పాదయాత్రకు వస్తున్న విశేష స్పందనను చూసి రాజకీయాల్లో తిరిగి కొనసాగాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కోటంరెడ్డి సోదరులను కలిశానని వారు కూడా ఆప్యాయంగా తనను ఆప్యాయంగా అక్కున చేర్చుకున్నారన్నారు.

## కార్మికుల సంక్షేమం, ఆర్టీసీ పునరుజ్జీవమే కూటమి ప్రభుత్వం లక్ష్యం

### వినుకొండలో కార్మిక పరిషత్ కార్యాలయం ప్రారంభించిన ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఏప్రిల్ 3)

రాష్ట్రంలో ఆర్టీసీకి పునరుజ్జీవం, ఆ సంస్థ కార్మికుల సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. ఆర్టీసీని లాభాల బాటలో నడిపించడం, ప్రయాణీకులకు సౌకర్యాలు పెంచడం, గ్రామీణ ప్రజలకు సేవలు విస్తరించడమే లక్ష్యంగా అనేక చర్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకుంటున్నారని అన్నారు. వినుకొండ ఆర్టీసీ బస్టాండ్ వద్ద కార్మిక పరిషత్ నూతన కార్యాలయాన్ని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికుల సంక్షేమం పట్ల కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని తెలిపారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఆర్టీసీకి, కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ప్రభుత్వంలో విలీనం చేస్తామని చెప్పి, ఆస్తులు దోచుకునే కుట్రలు చేశారని. జీతాలు పెంచకుండా సంస్థను నాశనం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కార్మికులకు కొత్తబలం, గళం వచ్చేలా కార్మిక పరిషత్ బలోపేతమవుతోందని అన్నారు. కార్మిక సంఘాలతో కలిసి భవిష్యత్ విజయాల కోసం పనిచేస్తామని హామీ ఇచ్చారు. సంస్థ బాగుంటే కార్మికులు బాగుంటారని ఆ విషయం అందరు దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. అనేక సంవత్సరాల తర్వాత వినుకొండలో కార్మిక పరిషత్ కార్యాలయం ఏర్పాటు కావడం మంచి విషయమని, కార్మిక పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శేషగిరి రావు, కార్యదర్శి వై.శ్రీనివాస్‌లకు జీవీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన నాయకులు నాగశ్రీను రాయల్, బీజేపీ నాయకులు లెనిన్, పి సైదారావు, కార్మిక పరిషత్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.










On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com